నమ్మలేని నిజాలు

**జో**రు వానలు
నేలతాపం తీరింది
లాక నవ్వింది.

**ప**ని అడ్డలు
కష్టానికి రెక్కలు
పొయ్యిలో పిల్లి

**మ**బ్బులు స్వహా
మండె ఎండల వేడి
ఎల్ నినో కోర.

**పు**త్తిడి గిరి
రాయల జొన్నగిరి
సీమకు సిరి

**రై**తుల పబ్బం
ఏరువాక పౌర్ణమి
నిండాలి గుమ్మం



– రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక


website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com


శ్రీనిజాలు

ప్రైవేట్ భూములే కొన్ని
నిషేధమైనవి నిజమే!
క్షమాపణలు చెబుతున్నం
తప్పు జరిగింది నిజమే!
నిషేదాల ఆస్తుల్లో
భూ భాగోతాలు!
రాజకీయ నాయకులే
రక్కసి భూతాలు!



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


హైదరాబాద్ గురువారం 20-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:13 పేజీలు:6 వెల: రూ.1/-


# రూ.13.041 కోట్ల రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

## కేంద్ర కేబినెట్‌లో రైల్వేకు భారీ ఊతం
## ఏపీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్
## రూ. 13 వేల కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి

న్యూఢిల్లీ, ఆగష్టు 19: దేశంలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రూ. 13,041 కోట్ల అంచనా వ్యయంతో పలు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమెదం తెలిపింది.

ఈ ప్రాజెక్టుల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కీలక రైల్వే పనులకు కూడా గ్రీన్ సిగ్నల్ లభించింది.

గుమ్మడిపూండీ–గూడూరు మధ్య 3,4వ రైల్వే లైన్ల నిర్మాణానికి రూ. 2,229 కోట్లతో కేంద్రం ఆమోదం తెలిపింది.

ఈ మార్గంలో అదనపు రైల్వే లైన్ల నిర్మాణంతో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు సరకు రవాణా సామర్థ్యం పెరగనుంది.

ఇక ఒడిశాలోని ఖంగ్‌పూర్–భద్రక్, భద్రక్–హరిదాస్‌పూర్ 4వ లైన్లు, అలాగే కటక్–పారాదీప్ మధ్య



3,4వ లైన్ల నిర్మాణానికి రూ. 2,286 కోట్లతో ఆమోదం లభించింది. దేశంలో రైల్వే నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడం, ప్రయాణీకుల సౌకర్యాలు మెరుగుపరచడం, సరకు రవాణాను వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను చేపడుతున్నట్లు కేంద్రం వెల్లడించింది.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు..

హైదరాబాద్, ఆగష్టు 19: ఉచిత కథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టనిబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృధా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాజనం అభిప్రాయపడింది.

భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో రేపు గురువారం చెప్పాలని ఆదేశించింది.

తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది.

కాగా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలను తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాలు లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.

# భారత్‌లో జమ్మూకశ్మీర్ ముఖ్యమైన భాగం

## ఒమర్ అబ్దుల్లాతో అమెరికా రాయబారి భేటీ

న్యూఢిల్లీ, ఆగష్టు 19: జమ్మూకశ్మీర్ అంశంపై అమెరికా నుంచి కీలక వ్యాఖ్య వెలువడింది. అమెరికా రాయబారి సెర్గియో గోర్ బుధవారం శ్రీనగర్‌లో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో సమావేమయ్యారు. అనంతరం జమ్మూకశ్మీర్ భారత్‌లో ఒక ముఖ్యమైన భాగం అని వ్యాఖ్యానించారు.

అమెరికా రాయబారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సెర్గియో గోర్ జమ్మూకశ్మీర్‌లో పర్చటించడం ఇదే తొలిసారి.

ఆర్టికల్ 370 రద్దు తర్వాత అమెరికా రాయబారి శ్రీనగర్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా జమ్మూకశ్మీర్‌కు భారత్‌లోని ముఖ్యమైన భాగంగా అమెరికా రాయబారి బహిరంగంగా పేర్కొనడం ప్రాధాన్యం కలిగిన పరిణామం అని చెప్పాలి. జమ్మూకశ్మీర్‌పై పాకిస్తాన్ తన వాదనను కొనసాగిస్తున్న సమయంలో భారత్ వైఖరికి అనుకూలంగా అమెరికా రాయబారి మాట్లాడడం అత్యంత కీలకంగా నిలవనుంది.

కాగా రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన జమ్మూకశ్మీర్‌తో పాటు లద్దాఖ్‌లోనూ పర్యటించనున్నారు. శ్రీనగర్‌లో ముఖ్యమంత్రి ఒబర్ అబ్దుల్లాను కలిశారు. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్, అమెరికా మధ్య సంబంధాలను మరింత విస్తరించే అవకాశాలపై చర్చ జరిగినట్లు ఒబర్ అబ్దుల్లా తెలిపారు. అంతకు ముందు ఒబర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన అంతర్గత సమస్యలను అమెరికా రాయబారి వద్ద ప్రస్తావించబోనని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్ సమస్యలను పరిష్కరించాల్సింది న్యూఢిల్లీ అని, వాషింగ్టన్ కాదని ఆయన పేర్కొన్నారు.

జమ్మూకశ్మీర్‌కు సంబందించిన అమెరికా ప్రయాణ హెచ్చరికను కూడా సమీక్షించే అవకాశం ఉందని సెర్గియో గోర్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికా తన పౌరులకు జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం, పౌర అశాంతి వంటి కారణాల ప్రయాణంపై హెచ్చరికలు జారీ చేస్తోంది.

# ఇండిగో వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య...

## టికెట్ బుకింగ్, చెక్‌ఇన్ సేవలకు అంతరాయం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 12: దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థల్లో ఒకటైన ఇండిగో వెబ్‌సైట్‌లో బుధవారం సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో పలువురు ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విమానాల లభ్యతను పరిశీలించే సమయంలో కొందరు వినియోగదారులకు "నో డేటా అవైలబుల్", "నో ఫ్లైట్స్ ఫౌండ్" వంటి సందేశాలు కనిపించాయి.

ఢిల్లీ నుంచి పలు నగరాలకు ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసేందుకు ప్రయత్నించినా విమాన వివరాలు అందుబాటులోకి రాకపోవడంతో బుకింగ్ ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది.

ఈ సాంకేతిక సమస్యపై ఇండిగో స్పందించింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపింది. రిజర్వేషన్ వ్యవస్థలో అప్పుడప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయని, వీటిని పరిష్కరించేందుకు సంబంధిత భాగస్వామ్య సంస్థతో కలిసి తమ సాంకేతిక బృందాలు పనిచేస్తున్నాయని పేర్కొంది.

మరోవైపు పలువురు ప్రయాణికులు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తమ సమస్యలను వెల్లడించారు. టికెట్ బుకంగ్‌తో పాటు ఆన్‌లైన్ చెక్‌ఇన్ సేవలను వినియోగించుకోవడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. విమాన ప్రయాణ సేవలు ఎక్కువగా డిజిటల్ విధానంపై ఆధారపడుతున్న నేపథ్యంలో ఇలాంటి సాంకేతిక అంతరాయాలు ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. భారీ సంఖ్యలో వినియోగదారులు ఒకేసారి సేవలను వినియోగించే సమయంలో పలు ఆన్‌లైన్ వేదికల్లో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

గత డిసెంబర్‌లోనూ ఇండిగోలో కార్యకలాపాల అంతరాయం కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుత వెబ్‌సైట్ సమస్యకు గల కారణాలపై సంస్థ పూర్తి వివరాలను వెల్లడించాల్సిఉంది.

# గత ప్రభుత్వంలో గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు-సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగష్టు 19: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పరీక్షల నిర్వహణలో గత వైసీపీ ప్రభుత్వ హయంలో భారీగా అక్రమాలు జరిగాయని సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ఏపీ శాసన సభలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 315 ప్రకారం ఏపీపీఎస్సీ ఏర్పడిందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర సర్వీసుల్లో వచ్చే అధికారులను గ్రూప్–1 పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారని, ఎంతో శ్రమించి అభ్యర్థులు ఉద్యోగాలు సాధిస్తారని చెప్పారు. అలాంటి పరీక్షల్లో గత ప్రభుత్వ హయంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

ప్రజలు, ఉద్యోగార్థులు ఈ అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ జవాబుదారీతనానికి వేదిక అని, ఇక్కడి నుంచే ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ఉందనీ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# తెలంగాణలో సినిమా టికెట్ రేట్లపై కీలక జీవో..5 షోలకు ప్రభుత్వం అనుమతి

హైదరాబాద్, ఆగష్టు 19: తెలంగాణ సినిమా టికెట్ రేట్లపై ప్రభుత్వం కీలక జీవో జారీ చేసింది. కొత్తగా స్పెషల్ థియేటర్స్ కేటగిరీని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 7.1 సౌండ్, 2కె/4కె స్క్రీన్లకు స్పెషల్ కేటగిరీ వర్తించనుంది. ప్రతి థియేటర్‌లో 25 శాతం నాన్–ప్రీమియం సీట్లు ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉదయం 8 నుంచి రాత్రి ఒంటిగంట వరకు 5 షోలకు అనుమతి ఇచ్చింది.

చిన్న సినిమాలకు ప్రతి రోజు ఒక షో తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. రూ.100 కోట్లు పైబడిన సినిమాలకు ప్రభుత్వం సూపర్ హైబడ్జెట్ హోదా కల్పించింది. తొలి 10 రోజులు టికెట్ ధరలు పెంచుకుచే అవకాశం కల్పించింది. టికెట్ పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత శాతాన్ని కార్మికుల సంక్షేమ నిధికి విరాళంగా ఇవ్వాలని షరతు పెట్టింది. కార్మికుల సంక్షేమ నిధికి రూ.కోటి వరకు విరాళం తప్పనిసరి చేసింది.

# డీఎంకే నేతల వివరాలు నా దగ్గర ఉన్నాయి

చెన్నై. ఆగష్టు 19: ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్ పైనే ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు ఆ ఫైల్స్ తెరుస్తానని స్పష్టం చేశారు. తనను బలవంతం చేసి, ఆ ఫైల్స్ ఇప్పుడే తెరిచేలా చేయెద్దని డీఎంకే నేతలకు వార్నింగ్ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వ హయంలో రోడ్ల నిర్మాణ పనుల్లో చోటు చేసుకున్న అవకతవకలపై బుధవారం తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి విజయ్ డీఎంకే పార్టీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ ఎం చెప్పాలో నాకు తెలుసు.. అందుకే ప్రజలు మాపై నమ్మకంతో ఈ స్థానంలో కూర్చో బెట్టారు. ఉప ఎన్నికల సమయంలో నేను మాట్లాడతాను అని అన్నారు.

పుస్తక సమీక్ష

# ఎచటినుండి వీచెనో !

ఎన్నో కవిత్వ పుస్తకాలను రచించి, నవనవోన్మేషమైన కథలనూ నవలలనూ విరచించి, నిఘంటువులు నిర్మించి, పదప్రయోగ సూచికలకు మార్గదర్శనం చేసి, భాషాగ్రంథాలను భాస్వంతముగా వెలయించి, అనువాదాలకు హృదయాన్ని అద్ది, వ్యాస సంపుటులు రాసి, సంపాదకత్వాలు వహించి విద్యావంతులను పండితులను మెప్పించిన డాక్టర్ నలిమెల భాస్కర్ ఇప్పుడు పిల్లల కోసం పాటల పుస్తకం అందిస్తుంటే "ఎచటి నుండి వీచెనో ఈ చల్లని గాలి" అనిపిస్తుంది.

పిల్లలు చిరునవ్వుల ముల్లెలు, బంగారు కొండలు, పూల చెండులు. ఈ "పిల్ల తెమ్మెరలు"లో "మీ గెంతుల ముందు / ఇంక జింకలెంత పాటివి / మీ కురుల కదలికలకు / తెమ్మెరలా సాటివి" వంటి ఆకర్షణీయమైన పోలికలున్నాయి. "మీ కనుల కాంతులతో మమ్ముల వెలిగింతురు / మీ ముద్దుల ముద్రలతో మా చింతల తొలగింతురు" వంటి, పిల్లలు పెద్దల ఆనందానికి కారణమయ్యే మాటలున్నాయి. "మీ బుడిబుడి అడుగులతో / పుడమి పులకరించును" చిన్నపిల్లలు కల్లాకపటం తెలియని వారు. స్వచ్ఛమైన వారు. వారి అడుగులతో పుడమి పులకరిస్తుందనడం సముచితం. పిల్లలు పెద్దల హృదయాలపై నవ్వుల నాట్లేస్తారని, ప్రసన్నమైన ప్రశాంతమైన పంటలు పండిస్తారని భాస్కర్ అభిప్రాయం.

భాస్కర్ మొదట ఉపాధ్యాయుడు. అందుకే "మీ గుండ్రటి ముఖాలను చూసిన తర్వాతనే /తెలుగు అక్షరాలు అంత గుండ్రంగా రాసినాము / మీ ముద్దులు మూటగట్టు మాటలు విన్నంతనే / తెలుగు పాటలన్ని ఎంతో తియ్యంగా పాడినాము" అనగలిగాడు. "లాలిత్యం లాలపోస్తే మీరైనారూ। లావణ్యం పోతపోస్తే మీరౌతారూ / కోమలత్వమంత తెచ్చి / ఒక్కచోట కుమ్మరిస్తే / ప్రాణాల్ పోసుకు వచ్చిన / పవిత్ర మూర్తులు మీరు". అటువంటి "మీకోసం పాట రాసై బ్రతుకు ఎంత ధన్యమూ / మీకు పాఠం చెబితే పుటక ఎంత పుణ్యమూ" అని పరవశిస్తాడు. "నిష్కళంక ధరిత్రికీ మీరు గొప్ప వనరు" అని కితాబునిస్తాడు.

"పిల్ల తెమ్మెరలు" లోని కొన్ని పాటలు అసమానతపై సంధించిన అస్త్రాలు. పచ్చి వెన్న ముద్దల వలె చల్లని బుగ్గల పిల్లలకు, లోతుకు పోయిన చెంపల పేద పిల్లలను మరువొద్దంటాడు. "విలువగు దుస్తుల విరిసే మురిసే / ముసిముసి నవ్వుల పిల్లల్లారా / చిరుగుల పాత్రల చింపుల / పిల్లల చేరదీయడం మానొద్దూ". ఇది పిల్లలకే కాదు. ఆలోచిస్తే పెద్దలకూ పాఠమే. ధనవంతుల మేడలు, వారి దుస్తులు, వారి ఆహారం అంతా శ్రామికుల శ్రమ ఫలితమే. శ్రామికులను ఎల్లప్పుడు ఆదరించాలి.





ప్రతులకు: నలిమెల సావిత్రి
9-5-218/1, టెలిఫోన్ క్వార్టర్స్, రోడ్ నెం.1
ప్రగతినగర్, రాంనగర్, కరీంనగర్-505 001. తెలంగాణ. సెల్:9704374081

"ఎండలో వానలో / కండల్ని కరిగించి / నేల గర్భంలోన / రత్నాలు వెలయించి / కష్టపడు రైతన్న పస్తులుంటున్నాట్ట". ఈ కష్టాలను పిల్లలకు తెలియజెపితే వాళ్లకు చిన్నప్పటినుండే కష్టం విలువ తెలుస్తుంది. కష్టపడే వాళ్ల పట్ల గౌరవం పెరుగుతుంది. అందుకే "రావోయి చిన్నారి పాపా / అసమానతలు రూపుమాప" అని పిలుపునిస్తాడు. పిల్లలను ఆడనివ్వాలి, పాడనివ్వాలి, అసమానతలు తొలగేలా ఆనందంగా పని చేయనివ్వాలి.

"నీతి న్యాయం నిండుగ వున్న / పిల్లల్లారా రారండ్రా / దుర్మార్గపు సంఘాన్ని కూల్చగా / దౌర్భాగ్యపు దేశాన్ని మార్చగా / బయలుదేరి రండీ ఇంకా / భయం వదలి రండీ /... పాలుగారెడ్డి పసివాళ్లంతా / పశువుల కాపరులవుతూ ఉంటే / బాలబాలికలు భావిపౌరులని / లెక్చరు దంచే నాయకవరులను / ప్రశ్నించర బాబూ / కొంచెం చర్చించర బాబూ". ఇందులో అన్యాయాన్ని ప్రశ్నించడం ఉంది. జనాన్ని మేల్కొల్పడమూ ఉంది.

పిల్లలకు చదువు గొప్పతనాన్ని తెలియజెప్పే పంక్తులెన్నో ఉన్నాయిందులో. "కడగండ్లే ఉండకుండ / చదువు గంధ మద్దుకోండి". పాఠ్యపుస్తకాలలో ఉన్న చదువు మాత్రమే కాదు. "సమాజ పుస్తక మందు దాగినా / పేద బతుకుల పేజీల్ తిప్పి / ఆలోచించన్నా – కొంచెం అవలోకించన్నా" అని కోరుతున్నాడు. "స్వార్థానికి కాదు సుమా చదువు నిచ్చెనా / పరార్థం లేకపోతె చదువు వచ్చునా?" అని నిలదీస్తున్నాడు.

చదువును మధ్యలోనే ఆపేసే పిల్లలను గురించి "అన్నమెప్పుడైనా నువు / సగం సగం తిన్నావా? / దాహానికి నీళ్ళు నువ్వు సగం సగం తాగావా!" మరి చదువెందుకు మధ్యలో ఆపుతావు? అంటూ వాళ్లను చదువు వైపు మరలిస్తాడు.

చదువెందుకు? అనే ప్రశ్నకు ఈ పుస్తకంలో నలుగురిలో దీపమై వెలిగేందుకు, న్యాయానికి ప్రాణంగా నిలిచేందుకు, పేదజనం కన్నీటిని తుడిచేందుకు, తలిదండ్రుల కలలు నిజం చేసేందుకు, భవిత ఉజ్వలంగ భాసిల్లేందుకు అనే సమాధానాలు దొరుకుతాయి. సంస్కారం ఎందుకు అనే ప్రశ్నకు విజ్ఞానం విశ్వంలో విరిసేందుకు, వేసట బతుకులకు బాసటగా నిలిచేందుకు అనే జవాబులూ దొరుకుతాయి.

పరిసరాల నుంచి కూడా మనం పాఠాలు నేర్చుకోవచ్చు. గుట్టలు – ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంగా ఉండుమని బోధిస్తాయి. నదులు–చలన శీలాన్ని నేర్పుతూ, మనలోని బద్ధకాన్ని వదిలిస్తాయి. పువ్వులు నవ్వుల్ని పూయిస్తాయి. రివ్వున ఎగిసే పిట్టలు – ఎగిరే ఆశలు ఉంటే ఎంత పెద్ద లక్ష్యమైనా చేరుకోవచ్చని చెబుతాయి.

ఈ పుస్తకంలోని పాటల్లో అణువణువునా కవిత్వముంది. "నేలకు పచ్చని తలవెంట్రుకలు చెట్లూ / గుట్టలకూ ఈ చెట్లూ / గొప్ప పచ్చబొట్లు" "కొండలపై నీటి నవ్వు జలపాతం / వాన పిదప నింగి పువ్వు ఇంద్రచాపం" "గుట్టలు భూమితల్లి నిండు బుగ్గలు / లోయలేమొ ఆ బుగ్గల ముద్దు సొట్టలు". ఇవన్నీ చక్కనై ఊహలు, సౌందర్యభరితమైన భావనలు.

"మానవత్వపు చెట్టుకొమ్మలు / మరల చివురులు వేయుచున్నవి / చివురు చాటున చిన్నికోయిల / కొత్త గొంతుక నెత్తుచున్నది" చక్కని, చిక్కని అభ్యుదయ గీతం. "మనిషి మనిషికి మధ్య కట్టిన గోడలవిగో కూలుచున్నవి. / సమత మమతల కుసుమములు / ప్రతి స్వాంతమందున పూయుచున్నవి". భవిష్యత్తు పట్ల ఎంత గొప్ప ఆశాభావం!

కవిత్వం, సమాజం, భాష, సంస్కృతి, ప్రకృతి, చదువు, సంస్కారం, పిల్లలు, పెద్దలు.. ఇలా ఎన్నో అంశాలపై డా. నలిమెల భాస్కర్ రాసిన ఈ పాటల పుస్తకం మనపై చూపించే ప్రభావం చాలా గొప్పది.

బాల సాహిత్యం ఇంకా విరివిగా రావాల్సి ఉంది. బాలలకు శిశు దశ నుంచే సంస్కార భావాలు అందాల్సి ఉంది. సమాజంలో మంచిని పెంచే దిశగా వారు ఎదగాల్సి ఉంది. మంచి సమాజాన్ని మనమంతా కలిసి నిర్మించాల్సి ఉంది.



–ఎ. గజేందర్ రెడ్డి
9848894086

నానీలు

పచ్చని పల్లె జీవితం
పాలిపోతుంది
చేలన్నీ
చేపల చెరువైనందుకు.
– సాయి వెంకన్నబాబు

నానీలు

పల్లె అంగవైకల్యంతో
కుంటుతుంది
ఫ్లోరిన్
నీ కాళ్లిరగ్గొట్టాలి.
–ఎస్. రఘు

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 20-8-2026

## సప్త పదులు

ప్రక్రియా సృజనకర్త: సుధామ



అండనీ
పిండం

మానవ
దేహం కన్న
ఏముంది
బ్రహ్మాండం .

-వి. సుబ్బారావు
పెందుర్తి, వైజాగ్.

కోరిక
మారిక

ప్రయత్నం లేని
ఆశ
జీవితానికి
చారిక.

-వి.యస్.శాస్త్రి ఆకెళ్ళ
విజయనగరం.

బాల్యము
సమతుల్యము

ఆనాటి
జ్ఞాపకాల సరదాలు
ఎప్పటికయినా
అమూల్యము.

-శ్రీ విశ్వేశ్వర పుష్పం.
ఒడిశా

నదురు
బెదురు

ఏంలాభం ఉన్నా
మనిషికి
లేదు
కుదురు.

-చెరుకుపల్లి గాంగేయ
శాస్త్రి, రాజమండ్రి

సమరగీతం
అమరగీతం

వందేమాతరం
నినాదం
విదేశీయుల పాలనకు
చరమగీతం

-విన్నకోట ఫణీంద్ర
హైదరాబాదు

# పఠితృలోకానికి పసందైన ఉపాయనం

తెలుగు సాహిత్య రంగంలో 'భీష్మపితా మహ' లాంటి 'విహారి' గారిని ఎరుగని సాహితీప్రియు లుండరు. తన కథా, నవల, పద్యకావ్యాలు వచన కవిత్వం వ్యాసాలుతో 60 ఏళ్ళుగా తెలుగు పాఠకులను అలరిస్తున్నారు. పలు సాహితీప్రియులలో 60 వరకు పుస్తకాలు ప్రచురించారు. 15 అక్టోబరు 1941న తెనాలి (గూంటూరు జిల్లా)లో నిరుపేద కుటుంబంలో జన్మించారు. ఎం.ఎ. వరకు చదివిన వీరు చిర కాలము, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాలో పలు పదవులు రీటయిరయి, తెలుగు సాహిత్యానికి Torch bearer గా వెలుగొందుతున్నారు.

డా॥ చెంగల్వ రామలక్ష్మి, బొడ్డపాటి చంద్రశేఖర్ దంపతులు విహారిగారి సాహిత్య జీవన ప్రస్తానాన్ని 'దర్పణం' అన్న పేరుతో ప్రకటించారు. పేరుకు సరిగ్గా సరిపోయినట్లు ఈ దర్పణం విహారిగారి రచనా కౌశల్యానికి అద్దం పడుతున్నది.

17 కథా సంపుటాలు (దాదాపు 350 కథలు) 7 నవలలు 7 కవితా సంపుటాలు, 22 వ్యాస సంపుటాలు 7 పద్య కవితా సంపుటాలు 3 వచన కావ్యాలు 4 స్వీయ సాహిత్య సమాలోకన గ్రంథాలు 4 సంపాదకత్వ భాగస్వామ్య నెరపిన గ్రంథాలు. 1 ఛంద స్సుందర మహాకావ్యం. విహారి గారు తెలుగు సాహిత్య కళామ తల్లికి అలంకరించిన ఆభరణాలు. 85 ఏళ్ళు అయినా వీరి రచనా పఠిమ ఇంకా వెలుగొందుతూనే ఉంది.

వీరు పొందిన పురస్కారాలు సత్కారాలు లెక్కకు లేనన్ని. వీరిని సమ్మానించి తమకు తాము ధన్యత చేకూర్చుకోలేని సంస్థలు తెలుగు దేశాన లేవు అంటే అది అతి శయోక్తి కాదు.

**'దర్పణం'** రచయితలు 150 పేజీలలో విహారిగారి రచనా వైదుష్యాన్ని తెలుగు వారికి చూపే ప్రయత్నం చేసారు. **'ప్రయత్నం'** అని ఎందుకు అనవలిసి వచ్చిందంటే కొండ అద్దంలో కనబడు తుంది. కాని అది అద్దం చూపగలి గినంత మేర మాత్రమే కద!

8 అధ్యాయాలుగా ఇచ్చిన 'దర్పణం'లో మొదట విహారిగారి జీవన రేఖలు ఇచ్చారు. 2వ అధ్యాయంలో వీరి కథలపై విశ్లేషణ ఉంది. మూడవ అధ్యాయంలో వీరి నవలా రచనను ఇచ్చారు. నాల్గవ అధ్యాయంలో ఛందోబద్ధ పద్యకవిత- శ్రీపద చిత్ర రామాయణం గురించి వివరించారు. అందరికీ తెలిసిన రామాయణమే! మరల నిదేల రామాయణమని.. అనుకోకుండా కావ్యమంతను తెలుగు తనంతో నింపారట విహారిగారు (పే 85) చింతాకయిన చింతలేక సీత తృప్తిగా రాముని వెంట వనాలకు నడిచిందట! కుడుము చేతికీయ పండుగ యను చిన్న దానను. అని సీత తన అల్ప సంతోషాన్ని ప్రకటించిందట! కరువు ఆకలి కందిచ్చు గంజి వోలె. తెలుగు ముంగిళ్ళ ముగ్గుల లెరగు



ప్రతులకు: విహారి
సెల్: 98480 25600



పరుచుకొన్న తమ్మి పూవులు (పే.89,91) వంటి అలంకారముల వాడి పద చిత్రరామాయణమును అలంకరించి నారు విహారిగారు.

**విహారిగారి విస్తృత వైవిధ్య అద్భుత సాహితీ నిరాడ్రూపానికి దర్పణాలు వీరి రచనలు. వీరి విస్తృత నిరంతర పటనాసక్తీ వీరిని ఒక ఉత్తమాభిరుచిగల పాఠకుణ్ణి చేసింది.**

వ్యాస సంపుటులలో విహారిగారి సమకాలీన సమాజ సమస్యలు రచయిత (విహారి) అనుభవం, అధ్యయనం, సంయమనం తెలుపుతాయట. ఛందోబద్ధమైన పద్యం ఎంత రమ్యంగా చెప్పగలరో అంత రమ్యత హృద్యతతో వీరి వచన కవిత్వం భాసిల్లుతోందట. మనోహరమైన పోలికలు, ఉపమానాలు వీరి వచన కవిత్వ సంపుటి **'చలనమ్'** లో ఉన్నాయంటారు రచయితలు. మార్కుల మాయాజా లంలో, రాంకుల పోటీలో విద్యార్థిలోకం నిద్రకు మొహం వాచిపోతోందట (పే.131) నూరుపాళ్ళూ నిజమే కద. **'మినుముల రాశిలో కలగలిసిన కందిగింజ'** లాంటి సామెతలు వీరి వచన కవిత్వంలో ప్రకా శించాయి.

నాకు తోచినంత వరకు విహారిగారికి ఇష్టమైన ప్రక్రియ కధారచన, చివరి రెండు (7వ మరియు 8వ అధ్యాయాలు) ఇందుకు కేటాయించి విహారిగారి కథల్లోని విశిష్టత తెలుపుతూ 55 ఏళ్ళుగా కథానికతో కలిసి నడిచిన వాళ్లు' అన్న విహారిగారి మాట లను 'కోట్' చేసారు.

వీటిని అసాధారణ తేజోరేఖలు, వస్తువులోనో వర్ణనలోనో మెరపించిన తళుకులకు ఎత్తిచూపారు. వ్యక్తిగత ఆనందంతో సామూహిక ఆనందాన్ని పంచారన్నారు. (పే.137) శ్రీశ్రీ కథా రచయితగా ఎంత మందికి తెలుసు? వారి రచన చావూపుట్టుక, కేవలం 18 పంక్తుల ఏకైక కథానిక అయినా, దాని గుణ నిర్ణయం చేసారు విహారి (139).

**'తెలుగు కథానిక... స్వరూప స్వభావాలు'** అధ్యాయంలో రచయితలు కథానికల కుండవలసిన క్లుప్తత, సందర్భశుద్ధి ప్రయో జనము ఉండితీరాలి (పే.145) అంటూ విహారిగారి కథల్లోని సందర్భాలు కొటేషన్లను ఉటంకిం చారు. ఇటు సాహిత్యానికి, అటు పాఠకులకు సమాన ప్రయోజనం చేకూర్చేవిగా వీరి కథా కృతులు న్నాయన్నారు.

విహారిగారి విస్తృత వైవిధ్య అద్భుత సాహితీ విరాడ్రూపానికి దర్పణాలు వీరి రచనలు. వీరి విస్తృత నిరంతర పటనాసక్తీ వీరిని ఒక ఉత్తమాభిరుచిగల పాఠకుణ్ణి చేసింది అంటూ He may will be deseribed as a priest of literature అనటం ఈ గ్రంథ రచయి తలే కాదు, సాహిత్యాభిమానులు అదరూ విహారిగారికి ఇవ్వదగిన కితాబు. 85 ఏళ్ళ వయస్సు లోకూడా విహారిగారి కలం ఏటేటికీ పదునెక్కుతున్నదనటం అక్షర సత్యం.

నిండు నూరేళ్ళు జీవిస్తూ, సాహితీ మతల్లికి రచనాభరణాలు అలంకరిస్తూనే ఉండాలని కోరుకుందాము.



**- కూర చిదంబరం**
సెల్: 8639338675

పుస్తక సమీక్షలు

# చీకటిని చీల్చే మనుషుల వెలుగు 'పడమటి సూర్యోదయం'

జీవితం ప్రతిరోజూ మన ముందుకు ఎన్నో కథలను తీసుకొస్తుంది. కొన్ని సంఘటనలు కాలగర్భంలో కలిసిపోతాయి. కొన్ని మాత్రం మనసు లోతుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. అలాంటి సాధారణ జీవితపు అసాధారణ అనుభవాలకు కథా రూపం ఇచ్చిన కథాసంపుటే **'పడమటి సూర్యోదయం'.**

ఈ కథలను చదువుతున్నంతసేపూ అవి కేవలం అక్షరాలుగా కనిపించవు. మనమే నడిచిన దారులు, మనమే కలిసిన మనుషులు, మనమే అనుభవించిన బాధలు, సందేహాలు, చిన్న చిన్న సంతోషాలు కళ్లముందు సజీవంగా ఆవిష్కృతమవుతాయి. పుస్తకం చదివిన తర్వాత కూడా పాత్రలు, సంఘటనలు, వాటి వెనుక ఉన్న భావోద్వేగాలు చాలాసేపు మనతోనే ప్రయాణిస్తాయి.

అవ్వారు శ్రీధర్ బాబు కథలు కేవలం సంఘటనల నవోదుగా ఆగిపోవు. సమాజపు మౌనాన్ని, మనిషి అంతరంగపు అలజడిని, కాలం నిశ్శబ్దంగా దాచిపెట్టిన నిజాలను సున్నితంగా వెలికితీస్తాయి. చుట్టూ నిత్యం కనిపించే మనుషులే ఈ కథల్లో పాత్రలుగా మారి మన ముందుకు వస్తారు. అందుకే ఈ కథలు కల్పితాలుగా కాక, జీవితం నుంచి పుట్టిన నిజాల్లా అనిపిస్తాయి.

'నీళ్లు వదిలేసిన ఊరు' కథలో ప్రాజెక్టు కోసం పల్లె ప్రాంతాలను ఖాళీ చేయాల్సి వచ్చిన ప్రజల ఆవేదనను రచయిత కళ్లకు కట్టినట్లు చిత్రించారు. ముఖ్యంగా రైతు మనోవేదన హృదయాన్ని తాకుతుంది. పొలానికి వచ్చిన పరిహారం మరోచోట పొలం కొనడానికి సరిపోదు. వ్యవసాయం తప్ప మరో పని తెలియని రైతు, తన భవిష్యత్తు ఏమవుతుందోననే ఆందోళనలో పడటం ఎంతో సహజంగా ఆవిష్కరించారు.

ఈ సంపుటిలోని ప్రతి కథ ఒక ప్రత్యేక ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. ఆశలు, ఆవేదనలు, వైఫల్యాలు, ఆత్మగౌరవం, ప్రేమ, బాధ్యత, అపరాధబోధ, సంబంధాల సంక్లిష్టత, జీవితపు అనూహ్య మలుపులు ఇవన్నీ రచయిత ఎలాంటి కృత్రిమత లేకుండా సహజంగా మలిచారు. ముఖ్యంగా పాత్రలను మంచి-చెడు అనే గీతలతో విభజించకుండా, వారి పరిస్థితులను అర్థం చేసుకునే దిశగా పాఠకుడిని నడిపించడం రచయిత కథన పరిపక్వతకు నిదర్శనం.

**'రాజోలు'** కథలో భార్య మరణించే ముందు వ్యక్తం చేసిన కోరికను తీర్చడానికి కొండను తొలిచి దారి వేయాలనే కథానాయకుడి పట్టుదలను రచయిత అద్భుతంగా చిత్రించారు. ఆ కథ చివరి వరకు ఆసక్తిని నిలబెడుతుంది.

రచయిత కథ చెప్పే తీరు ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది. అనవసర అలంకారాల ఆర్భాటం లేదు. అతిశయ భావోద్వేగాల ప్రదర్శన లేదు. అవసరమైన చోటే భావాన్ని స్పృశిస్తూ కథను సహజ ప్రవాహంలో ముందుకు నడిపిస్తారు. అందువల్ల ప్రతి కథ చదివిన అనుభూతి, ఒక జీవితాన్ని దగ్గరగా చూసిన అనుభూతిగా మారుతుంది. సంభాషణలు పాత్రల స్వభావానికి అద్దం పడతాయి. వర్ణనలు కథను భారంగా చేయకుండా మరింత జీవాన్ని అందిస్తాయి.

**'స్థిరనిర్ణయం'** కథలోని ప్రకృతి వర్ణన ఎంతో మనోహరంగా ఉంటుంది.





ప్రతులకు:
అవ్వారు శ్రీధర్ బాబు
8500130770



**ఈ సంపుటిలోని ప్రతి కథ ఒక ప్రత్యేక ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. ఆశలు, ఆవేదనలు, వైఫల్యాలు, ఆత్మగౌరవం, ప్రేమ, బాధ్యత, అపరాధబోధ, సంబంధాల సంక్లిష్టత, జీవితపు అనూహ్య మలుపులు ఇవన్నీ రచయిత ఎలాంటి కృత్రిమత లేకుండా సహజంగా మలిచారు.**

"సంజ గాలికి పుష్పాల పరిమళం వ్యాపిస్తుంది. కొమ్మలపై ఎన్నాళ్ల నుంచో కాపురముంటున్న పక్షులు, గూటికి తిరిగి వస్తున్న ఆనందంతో రాగాలు తీస్తున్నాయి. ఆ గొంతుకలను గుర్తించిన పిల్ల పక్షులు, తల్లి తెచ్చే ఆహారం కోసం సంతోషంగా కేరింతలు కొడుతున్నాయి."

ఇలాంటి వర్ణనలు కథను మరింత ఆస్వాదించేలా చేస్తాయి.

ఈ కథల్లో గ్రామీణ జీవితం తన సహజత్వంతో కనిపిస్తుంది. పట్టణ జీవితపు వరుగులు వినిపిస్తాయి. కుటుంబ సంబంధాల సున్నితత్వం, సామాజిక వైరుధ్యాలు, వ్యక్తిగత సంఘర్షణలు, కాలానుగుణ మార్పుల ప్రభావం ఇవన్నీ కథల్లో సహజంగా మిళితమై ఉంటాయి. అయితే వీటన్నింటికంటే రచయితకు మనిషిపై ఉన్న విశ్వాసమే ప్రతి కథలో అంతర్లీనంగా ప్రవహిస్తుంది. ఎంతటి చీకటి పరిస్థితిలోనైనా ఒక చిన్న వెలుగురేఖను చూపించే ప్రయత్నం ఈ కథలకు ప్రత్యేకమైన మానవీయతను అందించింది.

'పడమటి సూర్యోదయం' అనే శీర్షికే ఈ సంపుటి తాత్వికతను సూచిస్తుంది. సూర్యోదయం తూర్పునే జరుగుతుందనే సహజ సత్యాన్ని దాటి, అస్తమయం అనుకున్న చోటే కొత్త ప్రారంభం పుడుతుందని రచయిత చెప్పాలనుకున్న భావం ఇందులో ప్రతిధ్వనిస్తుంది. జీవితంలో ఆశకు దిశలు ఉండవని, ప్రతి ముగింపులోనూ మరో ఆరంభం దాగి ఉంటుందని ఈ శీర్షిక ప్రతీకాత్మకంగా తెలియజేస్తుంది.

ఈ కథలు పాఠకుడిని వినోదపరచడానికే రాయబడలేదు. ఆలోచింపజేస్తాయి. కొన్ని చోట్ల మనల్ని మనమే ప్రశ్నించుకునేలా చేస్తాయి. మరికొన్ని చోట్ల మనం కోల్పోతున్న మానవీయ విలువలను మళ్లీ గుర్తుచేస్తాయి. కథ ముగిసిన తర్వాత కూడా వాటి ప్రభావం మనసులో చాలా కాలం నిలిచి ఉంటుంది.

భాష ఈ సంపుటికి మరో ప్రధాన బలం. సరళమైన పదాలే అయినా వాటి వెనుక భావాల లోతు స్పష్టంగా కనిపిస్తుంది. ప్రాంతీయతను కోల్పోకుండా, పాఠకుడికి అత్యంత దగ్గరగా ఉండే భాష కథలకు సహజత్వాన్ని తెచ్చింది. అతిశయోక్తి లేకుండా భావోద్వేగాలను వ్యక్తీకరించడం రచయిత రచనా పరిపక్వతను తెలియజేస్తుంది.

ఇప్పటి కథాసాహిత్యంలో చాలాసార్లు కథ కంటే సందేశమే ముందుకు వస్తుంది. కానీ ఈ సంపుటిలో రచయిత ముందుగా కథను జీవింపజేశారు. ఆ కథలో నుంచే భావాన్ని సహజంగా పుట్టించారు. అందుకే ఈ కథలు పాఠాలు చెప్పవు, అనుభవాలను పంచుకుంటా యి. ఉపదేశించవు, మనసును మెల్లగా తాకుతాయి.

**'మనిషితనం'** కథలో లచ్చి, **'జాలి ఎవరి మీద?'** కథలో సూరయ్య, **'స్థిరనిర్ణయం'** కథలో కమలమ్మ, 'నిజరూప దర్శనం' కథలో కాంతమ్మ, అలాగే **'మనసు గెలిచిన మానవత్వం'** కథలో రంగనాథం ఇలాంటి పాత్రలు చదివిన తర్వాత అంత తేలికగా మరచిపోలేం.

ఈ కథాసంపుటి మరో విశిష్టత ఏమిటంటే, ప్రతి ఒక్కరూ చూసే సాధారణ సంఘటనల్లో దాగి ఉన్న అసాధారణమైన జీవితసత్యాలను గుర్తించి వాటికి కథారూపం ఇవ్వడం. మనం దాటవేసే క్షణాల్లోనే రచయిత కథను వెతికారు. మనం గమనించని భావాల్లోనే జీవితపు లోతును ఆవిష్కరించారు. అందుకే ఈ కథలు చదివిన తర్వాత మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కూడా కొత్త చూపుతో చూడాలనిపిస్తుంది.

'పడమటి సూర్యోదయం' కథాసంపుటి మనిషి అంతరంగాన్ని చదివించే అద్దం. సమాజాన్ని ప్రశ్నించే నిశ్శబ్ద స్వరం. ఆశ, అనుభవం, మానవత్వం అనే మూడు అక్షాలపై తిరిగే సాహిత్యయాత్ర.

తెలుగు కథను ప్రేమించే ప్రతి పాఠకుడి దగ్గర ఉండదగ్గ పుస్తకం ఇది. మంచి అనుభవజ్ఞుడైన కథకుడి నిబద్ధత, పరిశీలన, జీవిత అవగాహన ప్రతి కథలో స్పష్టంగా కనిపిస్తాయి.

శీర్షికకు పూర్తిగా న్యాయం చేసే కథలతో అవ్వారు శ్రీధర్ బాబు గారు తెలుగు కథాసాహిత్యంలో తనదైన స్వరాన్ని స్పష్టంగా నమోదు చేసుకున్నారు.

ఈ సంపుటి చదివిన ప్రతి పాఠకుడిలో ఆయన తదుపరి కథల కోసం ఎదురుచూపును కలిగిస్తుంది.

ఒక కథాసంపుటి సాధించగల అత్యున్నత విజయాల్లో అదీ ఒకటి.



**-ఎన్.లహరి**
9885535506

# చెట్టు నీడలోనే రేపటి శ్వాస



ప్రకృతి ఇప్పుడు
మనిషికి ఆశ్రయం కాదు...
ఆశ్రయం అడుగుతున్న అనాథ
మనం నరికిన ప్రతి చెట్టు
భూమి డైరీలో
ఒక మరణవార్తగా నమోదవుతోంది.
నదులు ఇక ప్రవహించడం ఆపేశాయి
దాహాన్ని మోస్తూ...
నిశ్శబ్దంగా నడుస్తున్నాయి... చూడు.
ఆకాశం నీలం రంగు ఎప్పుడూ కోల్పోలేదు
మన కళ్లే...
పొగరంగుకు అలవాటుపడ్డాయి...
అభివృద్ధి పేరుతో కాంక్రీటును పెంచుకున్నాం...
కానీ... నీడను కోల్పోయాం....
ఎత్తైన భవనాలు కట్టుకున్నాం...కానీ...
వర్షాన్ని పిలిచే ఒక్క దట్టమైన అడవిని
నిలబెట్టుకోలేక పోయాం... తెలుసా...
మనిషి గెలిచానని అనుకుంటున్నాడు
ప్రకృతి ఇంకా...ఓడిపోవడం నేర్చుకోలేదు
ప్రకృతి ప్రతీకారం...తుఫానై వస్తుంది
వరదై హెచ్చరిస్తుంది..ఎండగా శిక్షిస్తుంది
భూమి మన వారసత్వం కాదు...
మన పిల్లల దగ్గర నుంచి
అప్పుగా తెచ్చుకున్న మన భవిషత్తే ...
ఒక మొక్క నాటడం అంటే...
కేవలం పచ్చదనం పెంచడం కాదు
మన ఊపిరికి.....
ఒక జీవితకాల బీమా రాయడం
ప్రకృతిని కాపాడటం
పర్యావరణ ఉద్యమం మాత్రమే కాదు
మనిషి తనను తాను
రక్షించుకునే చివరి అవకాశం
ఇప్పటికైనా..గొడ్డలికి బదులు
గుప్పెడు విత్తనాలు పట్టుకుందాం...
ఎందుకంటే...!?
చివరి చెట్టు నరికిపోయిన రోజునే
డబ్బు తినలేమని మనిషి గ్రహిస్తాడు.
అప్పటికీ...తప్పు సరిదిద్దుకోవడానికి
మనకు కావల్సిన
భూమి మిగిలి ఉండకపోవచ్చు...!



**-డా॥కటుకోఝ్వల రమేష్**
సెల్:9949083327

# నేలతల్లి



వర్షం హర్షంతో దంచి కొట్టింది
ప్రకృతి పరవశించింది
నేలతల్లి మది పులకించింది
ప్రజల ఆందోళనసద్దు మణిగింది.

ఆషాఢ బోనం కరుణించింది
కర్షకుల యెద పొంగి పొర్లింది
విత్తనం మెలకెత్తడానికి సిద్ధమైనది
అవని ఆకు పచ్చగా వెలగనున్నది.

జన ఆర్తనాదాలకు మిన్ను అదిరింది
ఎలినినో తో పోరు సలిపింది
ఉత్తుంగ తరంగమై సంద్రం లేచింది
తుఫానుగా మారి భూమి తడిపింది .
నాయకుల నోళ్ళు మూయించింది
వీధి నాటకాలను చాలించమంది
కళ్ళు తెరిచి పాలన సాగించమన్నది
అబద్ధాల కు పిండం పెట్ట నున్నది



**-నమిలకొంథ నాగేశ్వర్ రావు**
8688553470

# మత్తు మబ్బుల దారి

ఆ దారి మబ్బుల దారి
అక్కడ వెలుగు కూడా మసకబారిన నీడే
అంతా మసక మసకగానే కనిపిస్తుంది
మత్తు మబ్బులు కమ్ముకున్న క్షణంలో
మనసు కూడా మాయల సముద్రంలో మునిగిపోతుంది
చిగురించే యవ్వనంలో పూసే చిరునవ్వుని దోచేస్తుంది
కలలతో పరుగెత్తే పాదాలకు కనపడని సంకెళ్లు వేసి
చీకటి గూళ్లలో బంధిస్తుంది.
ఒత్తిడిలో "సరదా" అనే పేరుతో
ఈ విషపుమత్తు దగ్గరకు వస్తుంది
మొదట మిత్రుడిలా నవ్వుతుంది
తర్వాత నీడలా వెంటాడుతుంది
చివరికి నిన్నే బానిసగా మార్చేస్తుంది
"నీవు నాశనమవుతున్నావు" అని
అదే మత్తు కొన్నిసార్లు హెచ్చరిస్తుంది
కానీ స్పర్శ, స్పందన కోల్పోయిన మొదడు
ప్రపంచాన్ని కూడా లెక్కచేయని స్థితికి చేరుతుంది
అప్పుడు జీవితం నేరాల నీడలో
పరుగెత్తే దారిగా మారుతుంది
చీకటే తోడుగా మిగులుతుంది.
చేతికి ఇంజెక్షన్ నొప్పి తగలకపోయినా
నాలిక కింద పొడి లేకపోయినా
ముక్కుకి ఆ వాసన అందకపోయినా
జీవితం వేళ్ల మధ్య జారిపోయే ఇసుకలా
ఒక అగ్నిరేఖగా మిగిలిపోతుంది
తల్లిదండ్రుల ఆశల తోటలో
పూసిన కలలు వాడిపోతాయి
ఆనందం వెలిసిన ఇంటి గుమ్మం
కన్నీటి సముద్రంగా మారుతుంది.
మత్తు మబ్బులు తొలగితేనే
జీవితం ఉదయ కాంతిలా వెలుగుతుంది
భవిష్యత్తు పచ్చని వసంతంలా వికసిస్తుంది
నీ వెలుగుతోనే దేశం భవిష్యత్తు ప్రకాశిస్తుంది
నీ సంకల్పాన్ని అగ్నిజ్యోతిలా వెలిగించు
నీ ఆత్మవిశ్వాసాన్ని పర్వతశక్తిలా నిలబెట్టు
గుర్తుంచుకో నీవు
రేపటి భారత స్వప్నానివి !.



**- చిత్రాడ కిషోర్ కుమార్**
9866912906



# అవినీతి ప్రక్షాళనే లక్ష్యంగా...

శ్రీమతి కొసరాజు సామ్రాజ్యం రచించిన **"చిగురింపు లేని వర్షం"** పుస్తకానికి ప్రముఖ కవి **రమణ వెలమకన్ని** రాసిన ముందుమాట.

కవన ప్రేమికురాలలైన కొసరాజు సామ్రాజ్యం సంపాద కత్వంలో వెలువడుతున్న నాలుగవ కవితా సంకలనం **'చిగురింపులేని వర్షం'**. 'సాహితీ కిరణం' సౌజన్యంతో కొసరాజు ఆర్తి & జాహ్నవి మెమోరియల్ ట్రస్ట్ **'అంతా అవినీతిమ యం- అంతం చేయాలి మనమిక'** అంశంపై జాతీయ స్థాయి కవితల పోటీ నిర్వహించి, పోటీకి వచ్చిన కవితలను సంకలనీకరించి సామ్రాజ్యం ప్రకటిస్తున్న పొత్తం ఇది. ఇదివరలో కొసరాజు ఆర్తి & జాహ్నవి ట్రస్ట్ ఆధ్వర్యంలో **'ఎగిరిపోయిన పిట్ట', 'వీధి కుక్క లు', 'ఎదురు చూపులు'** పేరిట మూడు కవితా సంకలనాలు వెలుగుచూసినాయి. ప్రతి యేటా ఒక సమకాలీన సామాజికాంశాన్ని ఎన్నుకుని కవితలపోటీ నిర్వహించి.. ఆ కవితల న్నింటినీ సంకలనీకరించి గ్రంథస్థం చేయడం ఆనవాయితీగా వస్తోంది.

కొసరాజు ఆర్తి, సామ్రాజ్యం గారి ఏకైక కుమార్తె, జాహ్నవి మనుమరాలు. ఒకానొక దుర్ఘటన లో ఇద్దరూ అత్యంత ఘోరంగా మృత్యువు పాలిట పడ్డారు. అంతకుముందే అల్లుడు కూడా తనువు చాలించాడు. ఇంతకన్నా దారుణం మరొకటి వుండను కోను. ఇంతటి విషాదాన్ని గుండె నిబ్బరంతో ఎదుర్కొని మళ్లీ మామూలు మనిషి కావడం ఎంతటి కష్టసాధ్యమో ఊహించు కోవచ్చు. సామ్రాజ్యం తన బిడ్డలపేరిట స్థాపించిన ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, శేష జీవితాన్ని అర్థ వంతంగా మలుచుకున్నారు. సాహిత్య కార్యక్రమాలతో మమేకమవుతూ సాంత్వన పొందుతున్నారు. కవితాపోటీలు నిర్వహిస్తూ, కవి సమ్మేళనాలు ఏర్పాటు చేస్తూ కవులను ఘనంగా సత్కరిస్తూ, కవితా సంకలనాలు వెలువరిస్తూ ఊరట చెందుతున్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖలో ప్రాజెక్టు డైరెక్టరుగా పదవీ విరమణ చేసిన కొస రాజు వారు సామాజిక- సాహితీ సేవల మరియు రచనా వ్యాసం గంలో తలమునకలవుతూ సమ యాన్ని సద్వినియోగ పరుచుకుంటున్న ధన్యజీవి.

ఈ సంవత్సరం నిర్వహించిన జాతీయస్థాయి కవితల పోటీకి తలబడ్డ శతాధిక కవితల్నుంచి ఏడు ఉత్తమ కవితలను ఎంపిక జేసే బాధ్యతను నాకు అప్పగించారు పొత్తూరి సుబ్బారావు. కవితలన్నింటినీ క్షుణ్ణంగా చదివిన నేను ముందుగా నాలుగు మాటలు రాస్తే బాగుంటుందని పొత్తూరివారు భావించారు.

విశ్వవ్యాప్తమైన అవినీతిని అంతమొందించాలని నినదిస్తూ లబ్ధ ప్రతిష్టులతో పాటు, వర్ధిష్ణువులైన వారు కూడా తమ కలాలను ఈ సంకలనంలో ఝుళి పించారు.

అవినీతిని ప్రోత్సహించేవారు వున్నంత వరకు... అవినీతికి పాల్పడేవారు వుంటేనే వుంటారు. ముందుగా మార్పు రావాల్సింది ప్రోత్సహించేవారిలో.

**"ముళ్ళదారివైపు అడుగు లేస్తూ**
**పూలబాటనెలా కలగంటావు?**

అంటూ మూలాలను ప్రశ్నిస్తున్నాడు మౌనశ్రీ మల్లిక్ తన **'అర్థమైందా రాజా'** కవితలో. ప్రథమ బహుమతిపొందిన కవిత ఇది.

కవిత్వం.. కవిత్వంలా రాసే కొద్దిమంది కవుల్లో నల్లు రమేష్ ఒకరని మీరే ఒప్పుకుంటారు. ఆయన **'చిగురింపులేని వర్షం'** కవిత చదివిన తరువాత. సంకలనం శీర్షిక కూడా ఇదే.

అవినీతిలో కూరుకుపోయిన సమాజాన్ని చక్కటి భావచిత్రాలతో, ప్రతీకలతో కవితను చెక్కిన తీరు పాఠకుల్ని అబ్బురపరుస్తుంది.

'ఆవిరయ్యే చెమట చుక్కలిక ఆలోచించుకోవాలి.
చిగురింపులేని వర్షానికి
ఊతమౌతాయా..లేక
ఉద్యమిస్తాయో!'

అంటూ అర్థవంతమైన ముగింపునిస్తాడు కవి. ద్వితీయ బహుమతి పొందిన కవిత **'చిగురింపులేని వర్షం'**.

సమాజాన్ని పట్టి పీడిస్తున్న అవినీతికి 'బాధ్యులం మనమే.. బాధితులం మనమే!' అని తేల్చేస్తారు జొన్నలగడ్డ శ్యామల. పరివర్తనతో మనం నీతిదారిన నడిచే సమయం ఆసన్నమయిందని గుర్తుచేస్తారు శ్యామల.



ప్రతులకు: శ్రీమతి కొసరాజు సామ్రాజ్యం
ఇ.నెం. 1-1-9/1 మోహన్‌నగర్, కొత్తపేట్
హైదరాబాద్-500 102
సెల్: 9640015514



**'కాలమెంతో విలువైందని తెలిసినా అవినీతి పరుల విచారణ లో జరుగుతున్న అంతులేని జాప్యాన్ని'** ఎత్తి చూపుతారు కవ యిత్రి షేక్ కాశింబి తన 'అదుపు' కవితలో.

**'అక్రమార్జనకు అంతిమ గీతంగా సామూహిక 'పిడికిలి'ని బలంగా బిగించాలి, సమర శంఖం పూరించాలి'** అని పిలుపు నిస్తున్నారు డా॥చిల్లర భవానీదేవి.

**'అవినీతికి సంకెళ్ళు వేద్దాం!'** అంటున్నారు కన్నోజు లక్ష్మీ కాంతం.

సీనియర్ కవులు ఎస్.ఆర్. పృథ్వీ, చిత్రాడ కిషోర్‌కుమార్, శింగరాజు శ్రీనివాసరావు, నా మని సుజనాదేవి, పొత్తూరి సీతా రామరాజు అందించిన కవితలు సంకలనానికే ఆభరణాలుగా నిలుస్తాయి.

సమాజాన్ని పట్టి పీడిస్తున్న అవినీతికై **'అక్షర సమరం'** పూరించడానికి సమయం ఆసన్నమైం దం టున్నారు గొర్రెపాటి శ్రీను. **'అవినీతిని అంతం చేద్దాం రండి'** అంటూ గుంటూరి రవిచంద్ర ప్రసాద్ ఘోషిస్తుంటే, 'అవినీతి రహిత సమాజం ఉదయించు నురా' అన్న ఆశాభావాన్ని వెలిబు చ్చుతున్నారు ఆచంట అంజని.

ఎంత చెప్పినా వినిపించుకోని, మారని లంచగొం డులను, అవినీతి పరులను 'ఉరితీయాలి' అంటూ తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు తుపాకుల వెంక టేశ్వర్లు. ఎంతైనా తుపాకుల వారు కదా! 'అవినీతిని కాటికం పుదాం' అంటూ గొంతు కలుపుతు న్నారు మాచవోలు శ్రీధరరావు.

పోటీకి వచ్చిన కవితలతో బాటు **'అవినీతి'** అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనంలో కవులు చదివిన కవితల్ని కూడా సంకలనంలో పొందుప రిచారు. పొత్తూరి సుబ్బారావు దంపతుల కవితలు పాఠకులను అలరి స్తాయి.

అవినీతిని పెద్దూరి వెంకట దాసు **'కనిపించని శత్రువు'**గా వర్ణిస్తే **'దేశవృక్షం నిండా అవినీతి చీడ.. కంపుకొట్టే దేశ దేహానికి అభ్యంగన స్నానమాచరింప జేయాలని'** అభిప్రాయపడతారు ఎన్వీ. రఘువీర్ ప్రతాప్.

**'రేపటితరం పంతం.. అవి నీతి అంతం'** కావా లని కాంక్షిం చారు తంగిరాల చక్రవర్తి. 'అవి నీతిలేని భారతాన్ని యువతే నిర్మించాలి' అని కలలుగన్న తంగిరాల వారి చివరి కవిత బహుశ అదే కావొచ్చు.

ఇలా ఈ సంకలనంలోని కవితలన్నీ ఆలోచనలు రేకెత్తించి సందేశాన్ని మోసుకొచ్చినవే కావడం విశేషం.

వస్తువునుండి పక్కకు జరగ కుండా కవితల్ని తీర్చిదిద్దిన తీరు కవుల/కవయిత్రుల పరిపక్వతకు దర్పణంగా నిలుస్తుంది.

కవిత్వం ఏం చేస్తుంది? రాసిన వారికి రాసిన వారికి, చది విన వారికి, విన్నవారికి మానస కోల్లాసాన్ని కలిగించి ఊరటని స్తుంది. మనం ఏ పోగొట్టు కుంటున్నామో తెలియజేస్తుంది. సమాజానికి దిశానిర్దేశం చేస్తుం ది. అంతిమంగా మనస్సుకు హాయిని కలిగిస్తుంది. చక్కటి అనుభవాన్ని, చిక్కటి అనుభూతిని మిగులుస్తుంది.

ఈ నాలుగు మాటలు వ్రాసే అవకాశం నాకు ఇచ్చిన పొత్తూరి వారికి, కొసరాజువారికి నా ధన్యవాదాలు.



**- రమణ వెలమకన్ని**
సెల్:9866015040

డా॥నిట్టల గోపాలకృష్ణ రచించిన **"టెలివిజన్ చరిత్ర"** పుస్తకానికి **డా॥ఓలేటి పార్వతీశం** రాసిన ముందుమాట.

# సమాచార వర్షిణి

దేవుడు అంటూ ఒకడుంటాడు కదా! ఆయన చల్లగా చూసి ఆయుర్భాగ్యం ఒకటి ఇవ్వాలి గానీ, మనిషి జీవితం చాలా విశాలమైనది. ఈ విస్తృతమైన జీవితం మనుషులు చాలా చేయ వచ్చు. కొంతమంది ఏమి చేయకుండానే పోవ చ్చు. ఏమి చెయ్యని వాళ్ళ గొడవ మనకెందుకు? చేసిన వాళ్ళ గురించే చెప్పుకుందాం. ఎన్నో పనులు చేసి గణన కెక్కినవాళ్ళు కొందరుంటారు. ఇంకా కొంద రుంటారు ఎన్నో చేయనక్కన లేదు. ఏదో ఒకటి చేసి పేరుకెక్కు తారు. ఇలాంటివాళ్ళని అదృష్ట వంతుల జాబితాలో వేసుకోవచ్చు. అనుకుంటాను. అయితే ఈ జాబితాలో తప్పనిసరిగా ఉంటాడు నిట్టల గోపాలకృష్ణ గారు.

ప్రసార మాధ్యమంలో చాలాకాలం పనిచేశాను కదా! అంచేత నాకు పరిచయస్థుడు గోపాలకృష్ణ గారు. ఒక యాభైశాతం సృజన, మిగిలిన యాభై శాతం సాత్త్వికత కలబోస్తే అదే గోపాలకృష్ణ. అందుకనేమో మొదట్లో నేను ఆయన సినిమా గోపాలకృష్ణ అంటే నమ్మలేదు. సరే నెమ్మది మీద నమ్మకం కుదిరిందనుకోండి. అది వేరే కథ. ఔను ఆయన సినిమా వాడు కదా! టీవీకి ఎందుకు వచ్చినట్టు? సందేహం కలగడం సమంజసమే! ఆయన ఒక డజనో ఎన్నో సినిమా లు తీసినవాడు. అంతకుమునుపే సహాయ దర్శకుడు, సహకార దర్శకుడూనూ. కనుక ఖచ్చితంగా సినిమా వాడే. మరి టీవీకి ఎందుకు వచ్చినట్టు? ఆ రోజుల్లో దూరదర్శన్ ఒక్కటే దృశ్యమాధ్యమం. టీవీలో వారానికో సినిమా చూపేవాళ్ళం. తరువాతి కాలంలో ప్రతిరోజూ ఒక సినిమా చూపిస్తుండేవాళ్ళం. తాను నిర్మాత హక్కుదారుడైన తన సినిమాను టీవీలో ప్రదర్శింప చేసుకోవడానికి గోపాలకృష్ణ దూరదర్శన్‌కి వచ్చేవారు. అదన్నమాట కథ. ఇలా టీవీకి రావడం వలన ఆయనకీ ప్రయోజనం, మాకూ ప్రయోజనం చేకూరింది.

అసలే దర్శకుడైన గోపాలకృష్ణ. చిన్న చిన్న సింగిల్ ఎపిసోడ్‌లు చేయడం డాక్యుమెంటరీలు చేయడం ఆయనకు ఒనగూరిన ప్రయోజనం. అవి దూరదర్శన్‌లో ప్రసారం కావడం, ప్రసా రానంతరం కొన్ని ఉత్తమ చిత్రాలుగా అవార్డులు గెలుచుకోవడం ఇలాంటివి కూడా ఆయనకు చేకూరిన ప్రయోజనాలు. మరి దూరదర్శన్ సంగతేమిటి? అవార్డు స్థాయిలో ఉంటే నాణ్యమైన కార్యక్రమాలు ప్రసారం చేశామన్న మంచిపేరు ఈ సంస్థ ఖాతాలో చేరింది. ఉభయత్రా లాభం అంటారు కదా! అది ఇదే. అదృష్టవంతుల జాబితాలో చేరినవాడు గోపాలకృష్ణ అని ఇంతకుమునుపే అన్నాను కదూ! దాదాపు దర్శకుడిగా డజనుకు పైగా చిత్రాలు చేసినా, అంతకుముందు సహాయ దర్శకుడిగా మరిన్ని చిత్రాలు చేసినా, చాలా కాలంగా ఆయన లక్ష్మణరేఖ గోపాలకృష్ణగా నిలిచిపోయాడు. దర్శకుడిగా, లక్ష్మణరేఖ ఆయన మొదటి చిత్రం. ఈ చిత్రం విషయంలో ఆయన చాలా సాహసాలు చేశారు. వినోద ప్రధానంగా కాక, సందేశప్ర ధానమైన కథాంశాన్ని తొలి చిత్రానికి ఎంచుకోవ డం గొప్ప సాహసం. అప్పటి వరకు ప్రేక్షకులకు తెలియని ఒక నూతన నటిని కథానాయికగా పరిచయం చెయ్యడం మరొక పెద్ద సాహసం. ఆ నటి పేరు జయసుధ. ఇన్ని సాహసాలతో, ఒక విలువైన చిత్రాన్ని విజయవంతంగా మనకు అందించారు. అందుకే ఆయన లక్ష్మణరేఖ గోపాలకృష్ణగా స్థిరపడిపోయారు.

అటు నాటకం, సినిమా నేపథ్యం, ఇటు టీవీ నేపథ్యం దృశ్యమాధ్యమంలో గోపాలకృష్ణ పేరు సముచితమైన ప్రఖ్యాతి సముపార్జించుకుంది. పరిచయమైన ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించడం గోపాలకృష్ణ అల వాటు. ఆ అలవాటు కారణంగానే, దూరదర్శ న్‌ను బాగా అధ్యయనం చెయ్యడం మొదలు పెట్టారు. ఈ దేశంలో దృశ్యమాధ్య మం పేరు దూరదర్శన్ సరే, మిగిలిన దేశాల మాటేమిటి? అక్కడ టెలివిజన్‌గా మనకన్నా ముందే పరిచ యం కావడం ఆయన గమనికకు వచ్చింది. ఆసక్తి పెరిగింది. ఇతరత్రా ఎన్నెన్నో విషయాలు సేకరించారు. విశ్వవ్యాపకంగా విరాట్ రూపంలో వెలుగుతున్న టెలివిజన్ కథ మన కు చెప్పాలనుకున్నారు. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ పుస్తకం.



ప్రతులకు: గోమాత సేవా ట్రస్ట్, రామాంతాపూర్ హైదరాబాద్. సెల్: 9493053206

ఇది అనేక అంశాల సమాహారమని నాకు తెలుస్తున్నది. నిజానికి, మిగిలిన దేశాల మాట ఎలా ఉన్నా, మన దేశంలో టెలివిజన్ మూడు ప్రధానాంశాలే కారణంగా ఊపిరి పోసుకుంది. సమాచారాన్ని అందించడం, విద్యావంతం చేయడం, వినోదాన్ని కలిగించ డం ఈ మూడే త్రికరణాలు దూరదర్శన్‌కి. ఈ కీలకాంశాన్ని గమనించారు గోపాలకృష్ణ. ఆయన పరిశీలన నిశితమైనది. అందుకే ముఖ్య విషయాల గురించి దొరికినంతగా సమాచారాన్ని సేకరించారు. ఎంత దొరికితే అంత మనకి అందించాలని సంకల్పిం చుకున్నారు. ఇక్కడ ఒక విషయాన్ని ముచ్చ టించుకోవాలి. తెలుగు వాళ్ళకి ఎందుకో మొదటి నుంచి చరిత్రను నిక్షిప్తం చేసుకోవాలనే తాపత్రయం పెద్దగా కనిపించదు. కొంత నిర్ల క్ష్యం కూడాను. అందుకే కొన్ని విషయాలను ఇప్పటికీ మనం సాధికారికంగా ప్రకటించలేని స్థితిలో వున్నాము. దాదాపుగా ఈ వెలితి అన్ని రంగాలలోనూ వున్నదనే అనుకుంటాను. సాహిత్య చరిత్రలోనే నిర్దుష్టమైన అభిప్రాయాలు లేవు. నన్నయ్య ముందా! నన్నెచోడుడు ముందా! అంటే ఇప్పటికీ వాదులాటలు వినవస్తూనే ఉంటాయి. పదకొండు శతాబ్దాల కాలం తరలిపోయినా మనలో మీమాంస. దీనికి కారణం చరిత్ర నిర్మాణం పట్ల అనాసక్తి. ఇప్పుడు టెలివిజన్ విషయంలోనూ అంతే.

టెలివిజన్ గురించి ప్రామాణికంగా, సాధికారికంగా సమాచార మిద్దామంటే, ఆ స్థాయి గ్రంథాలు ఎక్కువగా అందుబాటులో లేవు. అడపా దడపా కొన్ని గ్రంథాలో, వ్యాసా లో వచ్చినా సమాచార సారూప్య ంలో వైరుధ్యాలు వుంటున్నాయి. ఇటువంటి నేపథ్యంలో గోపాల కృష్ణ ఇటువంటి ఒక కొత్త గ్రంథాన్ని తీసుకుని రావడం సమాచారణీయమే.

టెలివిజన్‌కు సంబంధించిన అనేక అంశాలతో కూర్చిన కల్హార మాల ఇది. టెలివిజన్ పుట్టు పూర్వోత్తరాల వంటి కొన్ని వివ రాలతో పాటు, రంగస్థలం, రేడియో, టీవీల తులనాత్మక అంశా లున్నాయి. అలాగే సినిమా, టీవీల మధ్య సామీప్య సారూప్యాలను రచయిత వెల్లడిచేసే ప్రయత్నం చేశారు. టీవీ మాధ్యమంలో వినియోగించబడే సాంకేతిక పరిజ్ఞానాన్ని గురిం చిన సమాచారం పొందుపరిచారు. మనదేశం లోనూ, విదేశాల లోనూ వుండే టీవీ ఛానల్స్, కార్యక్రమాల ముచ్చ ట్లు వున్నాయి. వీటితో పాటు ఫిలం ఇనిస్టిట్యూట్‌ల వివరాలున్నాయి. ఓ.టి.టి. వివరాలున్నాయి. అంతేకాదు టీవీ కార్యక్రమాల ప్రొడక్షన్ సమా చారం ఉన్నది. అన్నింటితో పాటు టీవీ అవార్డ్స్ గురించిన సమాచారం చాలా విపులంగా ఉంది. ఏయే కేటగిరీల క్రింత ఏయే అవార్డులుంటాయో కూడా విపుల మైన సమాచారం ఉంది. సినిమా కు సంబంధించి, టీవీకి సంబందించి నటనలో నూ, అనుబంధిత సాంకేతిక పరిజ్ఞానంలోనూ అత్యుత్తమ శ్రేణి శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వమే స్వయంగా ముందుకు వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే ఈ వ్యవస్థ ఏర్పాటుకు పూణేలోని ప్రభాత్ స్టూడియోను ఎంపికచేసి, ఉ త్తమ టీవీ, ఫిల్మ్ శిక్షణా సంస్థగా రూపొందించిన విషయాన్ని కూడా ఆయన గుర్తు చేశారు.

కొన్ని అనుబంధ విషయాలను ఆలోచనాత్మ ంగా మన ముందు వుంచే ప్రయత్నం చేశారు రచయిత. "పత్రికల భాష- టీవీ భాష" అంటూ పది పంక్తులు వ్రాసి ఈనాటి సమాజం ఆలోచి ంచుకునేలా చేశారు. పూర్వం ప్రజల వ్యవహా రంలో వున్న భాషను పత్రికా భాషగా పెడుతూ ఉంటే ఇప్పుడిది తారుమారైంది. ప్రసార మాధ్యమాలలో వాడినట్టు భాష మాట్లాడటం కనిపిస్తోంది. ఈ పరిణామాన్ని ఎలా విశ్లేషిస్తారో భాషావేత్తలే చెప్పాలి. ఇంగ్లీషు పెరగడం ఎంత ప్రమాదకరమో, చక్కటి తెలుగు నుడికారం కను మరుగవడం అంతకన్నా విషాదం. గ్రామీణ నేప థ్యం కూడా కలుషితమైతే భాషకు అంతకుమించిన పెనుసవాలు మరొకటుండదు. పత్రికల భాషను భిన్నంగా టీవీ వార్తల భాష వుండాలి. వ్రాసే భాష, మాట్లాడే భాషలకి వుంటున్న తేడాలను గమనించాలి. ఇటువంటి పంక్తులు చదివినప్పుడు రచయిత గోపాలకృష్ణ ఎంతటి నిశిత పరిశీల కుడో మనకు అర్థమవుతుంది. ప్రసార మాధ్య మంలో భాషకు కలఃదా లక్ష్మణరేఖ ఉండాలన్న విజ్ఞుడతడు. ఏదైనా రచయిత వర్తమాన కాలానికి అనుగునంగా కొంత సమాచారాన్ని ఇస్తూనే, తన భావాలనూ జతచేశారు. రచయిత అందచేస్తున్న విపుల సమాచార గ్రంథాలతోనూ సరిపోల్చు కోవాల్సిన అవసరమూ ఉంది. మొత్తం మీద తన విశ్వ రూపాన్ని ప్రదర్శిస్తున్న టెలివిజన్ సమా చారాన్ని రచయిత గోపాలకృష్ణ ఒక చిరుజల్లుగా మనపైన కురిపించాడు. టెలివిజన్‌కు సంబంధిం చిన ఈ లఘు గ్రంథాన్ని అందిపుచ్చుకుంటే మన కు కలిగే భావన, ఈ గ్రంథం ఒక సమాచార వర్షిణి అందించిన గోపాలకృష్ణ ఒక రోమహర్షిణి.



**-డా॥వోలేటి పార్వతీశం**
సెల్:9440031213



ఆమ్‌గోత్ వెంకట్ పవార్ రచన **'పోర్యతార'** పుస్తకానికి **ఆచార్య సూర్య ధనుంజయ్** రాసిన ముందుబాట.

# తొలిపొద్దు

ప్రకృతిని పెనవేసుకొని ప్రకృతితోనే ఆత్మబంధాన్ని పంచుకున్న స్వచ్ఛమైన మనస్సు గలవారు బంజారాలు. వీరత్వానికి త్యాగమనే ఆభరణాన్ని అలంకరించి చరిత్రను ప్రభావితం చేసిన ఘనత వారిది. అటువంటి బంజారాల జీవితంలోని కష్టాలను, కడగండ్లను కథల్లో, కవిత్వంలో, గేయాల్లో, నిక్షిప్తం చేసి లోకానికి తెలియజేసిన కవులు, కథకులు, గేయాకారులు ఉన్నారు. కానీ బంజారాల ప్రాచీన సంస్కృతిని, సంప్ర దాయాల్ని, జీవన సౌందర్యాన్ని ప్రతిబిం బించే అంశాలను ఎవరూ స్పృశించలేదు. బంజారా వీరులు, వీరవనితల త్యాగాల బాటలో క్రాంతిరే ఖలా వెలుగులు నింపిన హీరిబాయి శౌర్యాన్ని నవలగా మలిచాడు వెంకట్ పవార్.

మల్లికార్జున్ హిరేమఠ్ రాసిన **'తాండ'** నవల ఉన్నా అది కన్నడ నటవలకు తెలుగు అనువాదం. ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, కర్ణాటక సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత బి.టి. లలితా నాయక్ రాసిన **'గతి'** నవల కూడా కన్నడ భాష లోనే వచ్చింది. దీనితో పాటు బళ్ళారి లోని విజయనగర శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్సిటీ ఇంగ్లీషు ప్రొఫెసర్ శాంతానాయక్ రాసిన నవల **'మలాణ్'** వంటి కన్నడ నవలలు వచ్చాయి. కానీ తెలుగులో వచ్చిన తొలి బంజారా చారి త్రక నవల **'పోర్యతార'** అని చెప్పవచ్చు.

ఈ నవలలో బంజారాల లదణీలు తరలే విధానాన్ని కళ్ళముందు కదలాడేలా రాశాడు రచయిత. సామూహిక ప్రయో జనాల్లోనే తమ అభివృద్ధిని గమనించిన తండా సహృదయ సమాజాన్ని ఈ నవలలో బలంగా ఆవిష్కరించారు. బం జారా లదణీలు జీవితాన్ని అన్వేషిస్తూ తర లిపోయే సన్నివేశాలు చరిత్ర మూలాల్లోకి పాఠకుడిని తీసుకెళ్తాయి.

వీరవనిత హీరిబాయి నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట పులులగిరి ప్రాం తాన్ని చైతన్యపరిచింది. ఈమె పూర్వీకులు ఈ ప్రాంతానికి తరలివచ్చిన విధానాన్ని, తండాను ఏర్పాటు చేసుకొని వలస జీవన పోరాటాన్ని స్థిర నివాసంలోకి మార్చు కున్న తీరును రచయిత చక్కగా వర్ణిం చారు.

గోవులనే సంపదగా, పశుపోషణనే తమ జీవనాధారంగా ఉన్నవారు బం జారాలు. కొన్ని బంజారా సమూహాలు కథానాయిక తాత మూడ్ హీరాలాల్ నా యకత్వంలో పులలగిరి అటవీ ప్రాంతా నికి తరలివచ్చాయి. అతని కొడుకు రూప్లా ఇతర బంజారా యోధుల ఆధ్వర్యంలో తండాను స్థాపించాడు. అంతే కాకుండా హీరాలాల్ అక్కడి మైదాన ప్రాంతాల ప్రజలతో మమే కమైనారు బంజారాలు. వీరు తమ అస్థిత్వాన్ని పదిలపరు చుకు ంటూనే జీవన పోరాటాన్ని కొన సాగించిన వైనం ఈ నవలలో కనిపిస్తుంది.

లంబాడీ వనితల వస్త్రాలంకరణ, సాతీభవానీల స్థాపన, ఎద్దులకు తమ పూర్వీకుల, వీరుల పేర్లు పెట్టుకోవడం, తీజ్ వంటి ఉత్సవాలను ప్రతిబింబిం చాయి. ప్రకృతి రంగులను తమ గుండెల్లో ఇముడ్చుకొని మూగప్రా ణుల్ని కూడా సాటి మనుషులను చూసి నట్టే దయ, కరుణతో చూడాలన్న మానవీయ కోణాలు నవలలో పరచుకొని ఉన్నాయి.



**ప్రతులకు:**
అమ్‌గోత్ వెంకట్‌పవార్
సెల్:

హీరిబాయి బాల్య విశేషాలను, ఆడిన ఆటలను కాగితపు కాన్వాసుపై రచయిత చిత్రించడం చూస్తే బాల్యంలో బంజారా పిల్లలు ఆడుకునే ఆటలు గుర్తుకు వస్తాయి. పోర్యతారలో దైవాన్ని దర్శించే బంజారాల ఆధ్యాత్మికతను, ప్రకృతి ఆరాధనను అడుగడుగున స్ఫురణకు తీసుకొస్తాడు రచయిత. తండాలో పిల్లలు పుట్టినప్పుడు మ్రోగించే వాద్యాల భిన్నతను, బాల్య ఉపచారా లను, బారసాల క్రతువును చెప్తూ హీరిబా యి వీర గాథను ప్రారంభిస్తాడు.

హీరిబాయి కాలంలో తండా బిడ్డలు పడ్డకష్టాలను, కరువు ధాటికి వలస పోయిన తీరును అందరికీ అర్థం అయ్యే టట్టు కథన పద్ధతిలో వివరించాడు రచయిత. బ్రిటీష్ యాక్ట్‌లను ప్రస్తావిస్తూ బంజారాలు ఆ చట్టాల ఫలితంగా ఎదు ర్కొన్న కష్టాలను మరొక్కసారి మనకు గుర్తు చేస్తాడు. ఆ సన్నివేశాలు పాఠకుల హృదయాలను బరువు చేస్తాయి.

హీరిబాయి ముత్తాత హీరాలాల్ శౌర్యాన్ని తన గుండెల్లో నింపుకుం దేమో.. జొన్నల లారీలపై పులిలా దూకి వస్త్రాలను కిందికి తోసేసేది. ఈ సంఘ టనల చిత్రీకరణ సాహషి హీరిబాయి మూర్తిమత్వాన్ని తెలుపు తుంది. ఈ నవల చదువుతున్న వారు తీవ్ర ఉ త్కంటతకు లోనవుతారు. **'ధైర్యే సాహసే లక్ష్మీ'** అన్న పెద్దల మాటను హీరిబాయి సత్యంచేసి చూపిందన్న విషయం విధితమవుతుంది.

**"సింహాలైనా, పులులైనా ఆకలైన ప్పుడే వేటాడుతాయి...''** అంటూ **'ధర్మబద్ధమైన ఆకలి పోరాటం మాది'** అన్న హీరిబాయి మాటల్ని రచయిత నవలలో పొందికచేశాడు. కథానాయకి ప్రకృతి ధర్మాన్ని పాటించి సంప న్నుల అక్రమ సంపదను దోచి పేదవారి కడుపులు నింపడానికి పూనుకున్నదని స్పష్టం చేస్తుంది. బంజారాలు సమ ఆర్థిక న్యాయాన్ని కోరుకుంటారని రుజువు చేస్తుంది హీరిబాయి పోరాటం.

బంజారా తొలిపొద్దు హీరిబాయి జీవితంలోని ప్రతీ పార్శ్వాన్ని తడుము తూ, వీరోచిత సందర్భాలను వివరిస్తూ ముందుకు సాగిన ఈ నవల దేశవ్యా ప్తంగా ఉన్న బంజారాల జీవన వ్యథలను మనోనేత్రం ముందు ఉంచుతుంది.

పేదల బాధలను దూరం చేసిన రాబిన్‌హుడ్ పండుగ సాయన్న, సర్వాయి పాపన్న, కొమురం భీం వంటి వారి బాటలో పోరాటం చేసిన హీరిబాయి తెగువను, పోరాట స్ఫూర్తిని కాలగర్భం లో కలిసిపోకుండా నవలగా పరిచయం చేసిన రచయిత వెంకట్ పవార్ అభినందనీయుడు.

ఈ నవల సుమారు 280 పేజీల్లో రాయబడింది. అందులో నూటికి పైగా పుటల్లో కథకుడు కథ చెప్పినట్లుగానే నవల సాగింది. పోరాట వనిత హీరి బాయి జననం వరకు ఈ ప్రాంత పరిస్థితులను, తండా వ్యవస్థ సాగుబాటు జరిగిన తీరునే ఎక్కువగా ప్రస్తావించాడు రచయిత. ఇదంతా ముందు ఉండడం వలన పాఠకుడికి అసలు విషయం తెలుసుకోవాలన్న ఆసక్తి తగ్గుతుంది.. కథానాయిక పుట్టుకకు ముందున్న స్థితిగతులను కొంత పరిచయం చేస్తూ నవలను ప్రారంభిస్తే బాగుండేది. ములాంశానికి తగ్గట్టుగా నవలా శిల్ప నిర్మాణం చేస్తే ఇంకా బాగుండేది. రచయితలో తమ సాంస్కృతిక వైభవాన్ని, జీవన పోరాటాన్ని చిత్రించడంలోని ఆసక్తి ఆ పని చేయించి ఉండవచ్చుని నా భావన. ఏదేమైనా ఇదొక మంచి ప్రయత్నంగా చరిత్రలో నిలిచిపోతుంది.

వెంకట్‌పవార్ లాంటి రచయితలు బంజారా జాతిలో ఇంకా పుట్టుకరావాలి. అప్పుడే తెలుగు సాహిత్యం పరిపూర్ణ మవుతుంది. 90వ దశకం నుండి అస్తిత్వ వాదాలు వచ్చాయి. ఎవరి వాదాన్ని వారు బలంగా వినిపించారు. కానీ గిరిజన గొంతుకను వినిపించే వారులేక ఒక స్తబ్దత ఏర్పడింది. ఇప్పుడిప్పుడే ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. నేడు ఆ దిశగా సాగుతూ గిరిజన జాతి బిడ్డలు తమ అస్తిత్వాన్ని నిలుపుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

వెంకట్ పవార్ ఇంతకుముందు 'మరో లదణీ' అనే రచనను చేశాడు. అదే స్ఫూర్తితో ఈ నవలను రాయడం ఆనందదాయకం. ఈ కవి, రచయిత మరిన్ని మంచి రచనలు చేయాలని ఆకాంక్షిస్తూ.. అభినందనలు తెలియజే స్తున్నాను.

వెంకట్ పవార్ చేసిన ఈ చిరు ప్రయ త్నాన్ని అందరూ ఆదరి స్తారని అభిలషిస్తున్నాను.



**-డా॥ సూర్యాధనంజయ్**
సెల్:9849104187



# మొగ్గలు

కులవృత్తులను నమ్మి కడుపులు నింపుకుంటున్నా
జీవితాలన్నీ గాలికి ఎగిరిపోయే దూదిపింజలయ్యాయి
కలికాలంలో కనిపించని చేనేత వస్త్ర కళాఖండాలు

దారం పోగులతో జీవం ఉట్టిపడేలా చిత్రాలను నేస్తూ
సృజనాత్మకతతో కళాత్మకచిత్రాలను ఆవిష్కరిస్తరు
అద్భుతమైన చేనేతకళతో అలరించేది నేతన్నలు.

పిడికెడు మెతుకుల కోసం కడుపు నింపాల్సిన
మగ్గంగుంత చితికిన దేహాలను వాగ్దానం చేస్తున్నది
బక్కచిక్కిన దేహాలిప్పుడు నేతన్నల పడుగుపేకలు



**-భీంపల్లి శ్రీకాంత్**
సెల్:9032844017

# జ్ఞాన దాతలం కావాలి!

"మనం గురువుల నుంచి పొందిన సనాతన భారతీయ ధార్మిక జ్ఞానాన్ని తిరిగి ప్రపంచానికి ఉచితంగా ఇచ్చేయాలి. ఇదే ధర్మం" అన్న సూత్రాన్ని అక్షరాల పాటి స్తున్నవారు ఈ రోజుల్లో ఎంద రుంటారు? సొంతంగా సృష్టించుకొనే కవిత్వం, కథలు, ఇతరేతర రచనల వంటి సృజనాత్మక సాహిత్యాన్ని పుస్తకాల రూపంలో ముద్రించు కొని ఆ ఖర్చును, ఒకింత లాభాలను పొం దడానికి, వాటికి ఒక వెల పెట్టి అమ్ముకో వడం సంగతి అలా ఉంచుదాం. మన ఇతిహాసాలు, ఉపనిష త్తులు, ధర్మ శాస్త్రాలలోని జ్ఞానాంశాలను మాత్రం గురువుల వద్ద లేదా పుస్తకాల ద్వారా నేర్చుకొని, తిరిగి దానినంతా ఒక పరంపరగా ప్రజలకు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఇచ్చేయా లని, అప్పుడే ధర్మం స్వచ్ఛందంగా విస్తరిస్తుందన్న విషయం మాత్రం చాలామందికి తెలియదు.

దీర్ఘకాలం పాటు కష్టపడి భారతీయ ధర్శనాలను అభ్యసించిన తర్వాత ఆచార్య మసన చెన్నప్పగారు. **"గురుదక్షిణగా నేను మీకేమివ్వ గలను? ఇవ్వలేక పోతే గురువు ఋణంలో పడతాను కదా"** అని వినయంగా అడిగినప్పుడు పండిత గోవదేవశాస్త్రి వారి నుంచి వచ్చిన సమాధానం అప్పుడు ఆయనను, ఆ తర్వాత ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరుస్తుంది. నా నుంచి నువ్వు పొందిన జ్ఞానం నిజానికి నాదికాదు, ఋషులది. నేను నీకు కొత్తగా నాదంటూ ఏమీ ఇవ్వలేదు. ఆ మాటకొస్తే నేనూ నా గురువులకు ఏ దక్షిణా ఇవ్వలేదు. వారి ఋణంలో నేను సైతం పడట్టే కదా...? ఈరకమైన గురువు ఋణాన్ని తీర్చుకొనే మార్గం ఒకటుంది..." అని ఆయనే మార్గోపాయాన్నీ సూచించారు. "...సదరు జ్ఞానాన్ని పదిమందికి ఫలాపేక్ష లేకుండా పంచిపెట్టడమే!" అన్నారట ఆయన.

అప్పటి నుంచీ చెన్నప్పగారు తాను పొందిన ఆధ్యాత్మికజ్ఞానాన్ని పైసా ఆశించ కుండా వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ ప్రసారమాధ్యమాలకు, ప్రజలకు అందిస్తు న్నట్లు చెప్పుకొచ్చారు. కొందరు అభిరుచి గల శిష్యులు, దాతలు ఆయన రచనలను పుస్తకా లుగా ముద్రించినా వాటినీ ఆయన ఉచితంగా ఆసక్తిగల వారికి అందించారు (జ్ఞానఋణ విముక్తి) నాకు తెలిసి 2018- 19లో 'చింతన' ప్రత్యేక పేజీలో ఆధ్యాత్మిక వ్యాసాలు రాసినందుకు 'నమస్తే తెలంగాణ' నుంచి కాని, ఈ పుస్తక వ్యాసాలను 2024 మార్చి నుంచి ప్రచురిస్తున్న 'విజయక్రాంతి' నుంచి కానీ ఆయన ఒక్క పైసా పారితోషికం తీసుకోలేదు. ఈ పుస్తకంలోని మొత్తం వ్యాసాలలో నాకు బాగా నచ్చిన వారి రచనపై సందర్భానికి సంబంధించిందే, చెన్నప్ప గారివలె ప్రత్యేకించి ఆధ్యాత్మిక, ధార్మిక జ్ఞానాన్ని అందరం ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రజలకు పంచడానికి ముందుకు రావాలన్నది నా కోరిక.

జీవితంలో ఎదిగి రావడానికి, ప్రయోజకులు కావడం మాత్రమే కాదు పదిమందితో శబ్బాష్ అనిపించుకోవడానికి, ఇంకా ప్రత్యేకించి సమాజానికి ఉపయోగపడే స్థాయికి చేరుకోవడానికి ఎవరికైనా ఎంతో కష్టపడ వలసి వుంటుంది. మంచి సంపన్నుల కుటుంబంలో పుట్టిన వారికైతే పై లక్ష్యం సాధించడానికి ఆర్థిక పరిస్థితి కొంత తోడుగా వుంటుంది. కానీ పేద, మధ్యతరగతి వారికి ఇల్లు గడవడం నుంచి అక్కడిదాకా వెళ్ళాలంటే ఎన్నో వ్యక్తిగత, కుటుంబ సుఖసంతోషాలను త్యాగం చేయవలసి వుంటుంది. అనేక అడ్డంకులను, ఆటుపోట్లను తట్టుకోవలసి వస్తుంది. అన్నింటికీ ఎదురొడ్డి, ధైర్యంగా తెగువతో ఇంకా అప్పుడప్పుడు సావాసాన్ని సైతం ప్రదర్శిస్తూ ఒక్కో అడుగే వేయవలసి వుంటుంది. దశాబ్దాలపాటు అంత మొక్కవోని దీక్షను ప్రదర్శించడం అందరివల్లా కాదు కూడా, మధ్యలోనే ఆశయాన్ని వదిలేసే వాళ్ళూ ఎందరో, ఆచార్య మసన చెన్నప్ప అలాంటి ఇలాంటి వ్యక్తి కాదు కాబట్టే ఏడు దశాబ్దాలుగా అంతటి గొప్ప కార్యాన్ని అత్యంత ఇత్తశుద్ధితో సాధించగలిగారు. ఆయన జీరోనుంచి హీరో స్థాయికి ఎలా ఎదిగారో తెలిస్తే మనకు ఆశ్చర్యమేస్తుంది. **'అనుభవ మంజూష'** శీర్షికతో ఇప్పుడు మన చేతుల్లోకి వచ్చిన ఈ పుస్తకంలోని ప్రతీపదం అక్షర సత్యం. ఆయన తన నిజజీవిత స్వీయానుభవా లనే ఇలా పూసగుచ్చి ఇచ్చారు. వీటిని 'విజయక్రాంతి' దినపత్రిక ఎడిట్ పేజీలలో ఏడాదిపాటు నిరాటంకంగా ప్రచురించి నందుకు నాకైతే ఎంతో సంతోషంగానే కాదు, ఒకింత గర్వంగానూ ఉంది. ఈ వ్యాసాలకు ఆచార్య చెన్నప్ప గారి అభిమానులు, శిష్యులే కాదు, సామాన్య పాఠకుల నుంచి కూడా విశేష స్పందన వచ్చిందంటే కారణం లేకపోలేదు.

ఒక సగటు పిల్లవాడు తెలివైన విద్యార్థిగా ఎలా కాగలిగాడు? విశ్వ విద్యాలయంలో ఆచార్యుని స్థాయికి ఆయన ఎలా ఎదగగలి గారు? ఒక్క రూపాయి కూడా ఆశించకుండా తన గురువుల నుంచి పొందిన ఉపనిషత్ సంపదను తిరిగి సమాజానికే పంచిపెట్టే గొప్ప ఔదార్యం ఆయనకు ఎలా వచ్చింది..? వంటి ఎన్నో ప్రశ్నలకు ఈ చిన్న వ్యాసాలు సమాధానం చెప్తాయి. చదువరులు ఈ వ్యా సాలను విడివిడిగాను లేదా క్రమపద్ధతిలో ఎలాగైనా తమ సౌకర్యాన్ని బట్టి చదువు కోవచ్చు. అయితే, మొత్తం వ్యాసాలు చదివితే తప్ప చెన్నప్ప గారి జీవిత పర్యంత కృషి ఎలాంటిదో, ఎంత తీవ్రమైందో, మరింత గొప్పదో తెలిసిరాదు. ఎనో డైరీలో రాసుకో వాల్సిన విషయాలు అయి వుంటాయిలే అనుకొని పుస్తకం పక్కన పడేస్తే మాత్రం ఎవరైనా పొరబడీనట్టే అవుతుంది. చాలా మంది తమ జీవితాలల్లో ఎదగడం వేరు, ఆచార్య చెన్నప్ప గారిలోని పట్టుదల, శ్రమ, కృషి వాటిల్లో నిక్షిప్తమైన నిఖార్స యిన నిజాయితీ పూర్తిగా వేరు.




**ప్రతులకు:** ఆచార్య మసన చెన్నప్ప
9-76/2, ఉదయ్‌నగర్ కాలనీ, బోడుప్పల్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, హైద్రాబాద్-500 092
సెల్: 9885654381

'ఎదగడం అంటే ఎంత ఆస్తి కూడబెట్టాం. ఎన్ని ఉన్నత పదవులను అలంకరించాం' అన్నది కాదు. సమాజానికి ఎంత చక్కగా, గొప్పగా ఉపయోగపడు తున్నామన్న దానిని బట్టి నిర్ణయించాలి. సమాజానికి ఉపయోగ పడటం కూడా పలు రకాలుగా వుంటుంది. వాటిలో రచనా వ్యాసంగం, సామాజిక ప్రసం గాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు మేధోసంపత్తికి సంబంధించినవి. బోధనా వృత్తిలో ఉన్నవారికి ఇవన్నీ ఒకింత సౌకర్యవంతంగా ఉంటాయి. అంత మాత్రాన అందరూ వాటిని పాటించే వాళ్లు ఉండరు. పాటించే ఆ కొంద రు కూడా ఏం రాస్తున్నారు. ఏం మాట్లాడు తున్నారు?" అన్నవి పరిగణనలోకి తీసు కోవాల్సి వుంటుంది. మనకు నచ్చిన వాటిని సమాజానికి ఇవ్వడం కాకుండా. సంఘానికి, ప్రజలకు ఏం కావాలి. ఏమవసరమో వాటిని ఇవ్వగలగడం ముఖ్యం. వృత్తిలో ఉన్నప్పుడు పిల్లలకు కావలసిన విద్యాబుద్ధులు చెప్పిన అధ్యాపకులు తరగతి బయట ప్రజలకు ఉత్తమమైన, ఉదాత్తమైన జీవన సంబంధ విష యాలను అందిస్తే అవి ఎందరికో ఆదర్శ వంతం అవుతాయి. ఆచార్య చెన్నప్ప గారు దీనిని అత్యంత సమర్థవంతంగా నిర్వహి స్తున్నారు. కథలు, నవలలు, కవిత్వం వంటి సాహిత్య ప్రక్రియలు ప్రజలపై ఒక రకమైన సైద్ధాంతిక భావజాల వ్యాప్తికి దోహదపడితే, ధార్మిక, ఆధ్యాత్మిక విజ్ఞానం వారిని తాము నమ్మిన ఉత్తమ జీవన విధానంలోకి నడిపిస్తుంది.

నాకు తెలిసి సనాతన భారతీయ వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలపై అత్యంత ప్రామాణిక పట్టును కలిగివున్న అతి తక్కువమంది ప్రముఖులలో చెన్నప్ప ఒకరు. సామాన్య పాఠకులు అర్థం చేసుకోగల స్థాయిలో సరళమైన భాషలో అందరూ చెప్పలేరు. మరీ ముఖ్యంగా సంస్కృత, తెలుగు గ్రాంథిక భాషలలో, సంక్లిష్ట సందిగ్ధ వివాదాస్పద అర్థ తాత్పర్యాలతో కూడి ఉండే హైందవ ఆధ్యాత్మిక విషయాలను సర్వజనా మోదంగా, తేలిగ్గా వివరించగలగడంలో వీరిది అందె వేసిన చేయి. గడచిన సుమారు పదేళ్లుగా నేను వారి రచనలను చదువుతూ, ప్రచురణలకు వాటిని సిద్ధం చేస్తూ, సహకరి స్తున్న వ్యక్తిని కాబట్టే, ఈ విషయాన్ని అంత గట్టిగా చెప్పగలుగుతున్నాను.

ఏడాది క్రితం 'విజయక్రాంతి' దినపత్రిక లో ఆయనతో నిజానికి ఆధ్యాత్మిక వ్యాసాలు రాయించాలనే తొలుత అనుకున్నాను. కానీ, అనుకోకుండా భగవంతుడు వారిచేత సామా జిక ప్రయోజకత్వంతో కూడిన ఓ రాజకీయ వ్యంగ్యవ్యాసాన్ని ('శునకోపా ఖ్యానం') సృష్టించారు. అది నాతోపాటు మా సంపాదకు లు కే.కృష్ణమూర్తి గారికీ నచ్చడంతో దానిని ప్రచురింపచేస్తూ, ఆ తరహా వ్యాసాలను రెగ్యు లర్ రాయిస్తే బావుంటుందని అనుకున్నాం.

ఆశ్చర్యకరంగా ఆ తర్వాత ఆయన నుంచి సాహిత్యసభల తీరుపై మంచి విమర్శనాత్మక వ్యాసం ('వ్యాకుల సభ) నాకు అందింది. వాస్తవానికి మొదటి వ్యాసం ఊహాత్మక ఇతివృత్తమైతే, రెండవది వారి నిజ జీవితంలో జరిగిన యదార్థ సంఘటన. ఆయన అంతటి తో ఆగకుండా తన జీవితంలోని అరుదైన, విలక్షణ అనుభవాలనే వ్యాసాలుగా రాయడం మొదలుపెట్టారు. నిజానికి ఈ తరహా స్వీయ అనుభవాత్మక రచనలు పత్రికలలో ప్రచురణకు పనికివస్తాయో లేదో అన్న శంక చెన్నప్ప గారికి మొదట్లో ఉండేది. దానిని తీర్చేస్తూ మేము వరుసగా అలాంటి వ్యాసాలనే ప్రచురిస్తూ రావడంతో చివరకు అవన్నీ ఇలా పుస్తక రూపంలో వెలువడటం సాధ్యమైంది. నాలుగు దశాబ్దాల నా మేగజైన్ జర్నలిజం అనుభవంలో కల్పిత విషయాలకన్నా ఇలాంటి వాస్తవిక జీవన సంఘటనలకే పాఠకాసక్తి, ఆదరణ ఎక్కువగా వుంటాయి. కారణం అవి తాము అభిమానించే వ్యక్తి నిజంగా ఎదుర్కొన్న సంఘటనలు కనుక. ఎందుకంటే వారినే సాధారణ ప్రజానీకం ఆదర్శంగా తీసుకుంటారు.

అలాగని మన జీవితంలో జరిగే ప్రతీ సంఘటననూ డైరీలలో రాసుకోగలమేమో కానీ, ఇలా పదిమంది దృష్టికి తేవాల్సిన పనుండదు. ఇందులోని ప్రతీ వ్యాసం దేనికదే ప్రత్యేకమైంది. ఒక్కోటి ఒక్కో సామాజిక, మానవీయ, కుటుంబ విలువలతో కూడిన సందేశాలను ఇస్తున్నది. చింతపల్లి స్కూల్లో తనకు పాఠాలు చెప్పిన టీచర్ల నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయంలోకి తాను ఆచార్యునిగా ప్రవేశించిన తర్వాతి వరకు ఎదురైన పలువురు ఉద్దండులైన మహామ హుల వరకూ ఆయనకు లభించిన వాత్సల్యప్రోత్సాహకాలు వెలకట్టలేనివి. తనను హైదరాబాద్ బస్సు ఎక్కించడానికి వస్తూ, వస్తువుల మూటను అమ్మ తన తలపై మోసుకు తెచ్చిచ్చే ఘటన అయితే మనతో కంటనీరు పెట్టిస్తుంది. గుండేరావు హర్కారే, పండిత గోవదేవశాస్త్రి మునిమాణిక్యం నరసింహారావు, వేటూరి ఆనంద మూర్తి, గోరాశాస్త్రి, కేకే రంగనాథా చార్యులు, ఇరివెంటి కృష్ణమూర్తి, సి. నారాయణరెడ్డి, జి.వి.సుబ్రహ్మణ్యం, తిరుమల శ్రీనివాసా చార్య, ఆచార్య ముదిగంటి గోపాలరెడ్డి అమరేశం రాజేశ్వరశర్మ, ఎం.వి.సౌందర రాజన్, సినీనటుడు రంగనాథ్, ముదిగొండ శివప్రసాద్, వావిలాల సత్యనారాయణ శాస్త్రి వంటివారంతా ఈ వ్యాసాలలో ఆయా సందర్భాలలో అద్భుతమైన జీవన సందేశాలనిస్తూ మనకు సాక్షాత్కారిస్తారు.

ఆచార్య చెన్నప్పగారి ఈ వ్యాసాలు చదివిన పాఠకులను వెంటనే మార్చేస్తాయని చెప్పను. కానీ ఇవీ, ఇంకా ఆయన రాయనివి, మున్ముందు రాయాల్సినవి అన్నీ కలిసి వారిని ఇలా తీర్చి దిద్దాయన్నది మాత్రం నిజం. "అందరూ.. చెన్నప్పులు కాగలరా? కావాలా? కావాల్సిన అవసరం ఉందా?" వంటి ప్రశ్నలకు ఆదర్శవంతమైన, నిరాడంబరమైన, అత్యాశలు అనవసర కాంక్షలు, పరుగెత్తి పాలు తాగడాలు, ఒకరిని చూసి కుళ్ళి పోవడాలు వంటివేవీ లేకుండా మొత్తంగా సమాజానికి మేలు తప్ప కీడు కాసింతయినా చేయని ఆయన జీవితమే సరైన సమాధానం అని నేననుకుంటున్నాను. చదివిన వారిలో ఒక్కరు మారినా లేదా మిగిలిన వాళ్లలో ఒక్క శాతం మార్పు వచ్చినా ఈ అక్షరాల లక్ష్యం నెరవేరినట్టే. నాకైతే, వ్యక్తిగతంగా గొప్ప ఆశలు లేవు. ఆయనవలె ఒక్క శాతం జీవించగలిగినా చాలు, జీవిత భాగస్వామితో అర్థభాగాన్ని పోగొట్టుకొని కూడా మిగిలిన సగం మనసునూ సమాజ శ్రేయస్సుకే కేటా యించిన ఆయన జన్మధన్యం కాకేమవ ుతుంది! ఈ పుస్తకావిష్కరణ జరిగింది (8.2.2025) చెన్నప్ప గారి 70వ పుట్టిన రోజున! ఇది వారి 60వ పుస్తకం. భగవంతుడు ఆయనకు మరింతగా తనలోని విజ్ఞానాన్ని పాఠకులకు పంచిపెట్టడానికి కావలసిన శక్తిని ఇవ్వాలని, సంపూర్ణ ఆరోగ్యంతో వారు దీర్ఘకాలం పాటు పూర్ణాయుష్షును పొందాలని కోరుకుంటున్నాను.



-దోర్భల బాలశేఖరశర్మ
సెల్: 8096677410



ఆచార్య మసన చెన్నప్ప రచించిన 'అనుభవ మంజూష' పుస్తకానికి దోర్భల బాలశేఖరశర్మ రాసిన ముందుమాట

# అభినందన మందారమాల



ఆప్కారి సూర్యప్రకాశ్ రచన "సినిమా టాకీస్' పుస్తకానికి - బి.కె. ఈశ్వర్ రాసిన ముందుమాట

'తెలుగు సినిమాల గురించి మీ అభిప్రాయమేమిటో ఒక్క మాటలో చెప్పండి' అని ఎవరో పెద్దమనిషి-ప్రసిద్ధ రచయిత, కవి పండితులు, చిత్రరంగంలో కూడా లబ్ధ ప్రతిష్ఠులైన మల్లాది రామకృష్ణశాస్త్రిగారిని అడిగారు.

"ఏముంది.. ఈ సినిమాలు తీసేవాడికి పరిశ్రమ.. చూసేవాడికి శ్రమ" అని ఆయన వ్యాఖ్యానించారు వ్యంగ్యంగా..

తెలుగు సినిమా వయసు 91 యేళ్ళు దాటింది. ఇప్పుడు వందల కోట్ల రూపాయ లకు పైగా పారితోషికాలు తీసుకునే తారలు తయార య్యారు. మరి భారీ సినిమాలు తీసి, అవి అపజ యాల పాలైనప్పుడు కొన్ని కొన్ని సందర్భాలలో ఆత్మహత్యలు చేసుకున్న నిర్మా తలూ ఉన్నారు.

కానీ మన తెలుగు సినిమా పత్రికలు- చిత్రరంగంలోని నిజాలన్నింటినీ బయట పెట్టవు. సినిమా పరిశ్రమ నిత్య కల్యాణం పచ్చ తోరణంగా ఉందని ఏ మాత్రం మొ హమాట పడకుండా అభివర్ణించేస్తుంటాయి. సినిమా తయారవకుండానే ఉత్తమ చిత్రం నిర్మాణంలో ఉంది అని ముందస్తు గా మెచ్చేసుకుంటాయి. తాము ఎప్పటికప్పుడు ఏ సినిమా గురించి రాస్తున్నా 'హీరో, దర్శకుడు, నిర్మాత ఇంకా తక్కిన ప్రముఖులు ఏ విషయం లోనూ రాజీపడకుండా, ఇంతకుముందు వచ్చిన సినిమాలన్నిటికంటే భిన్నంగా అంతా కొత్తదనంతో ఆ చిత్రం తీయడానికి నిర్విరామంగా కృషి చేస్తున్నారని చెబుతుంటాయి. మరి అలాంటి సినిమాల న్నిటికీ సంబంధించిన వాస్తవం ఏమిటంటే నూరు సినిమాలు తీస్తుంటే కనీసం పది కూడా విజయవంతం కావడం లేదు. ఐనా, ప్రతి సినిమా గురించి వాళ్ళు అలా రాయడం మానడం లేదు.

సినిమా పత్రికలు నిజాలను రాయడం అరుదు. ఆ మాటకొస్తే, ఇప్పుడున్నది 'ఫిలిం జర్నలిజం' కానే కాదు- 'ఫిలం పబ్లిసిటీ' లేదా సినిమా ప్రమోషన్‌కు దోహదపడే జర్నలిజం అని అనేవారు కూడా ఉన్నారు. ఏది ఏమైనా మంచి సినిమాల కోసం జరిగే కృషిలో భాగంగా ఉత్తమాభిరుచిగల సినిమా అభిమాని, మిత్రులు ఆప్కారి సూర్యప్రకా శ్‌గారి భావాలకు దర్పణంగా ఈ పుస్తకం వెలు వడుతోంది కాబట్టి ఇటువంటి సంద ర్భంలోనైనా మనం కొన్ని నిజాలను గుర్తుకు తెచ్చుకోవాలి.

జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రానికి స్వర్ణ పతకం ప్రవేశపెట్టిన తర్వాత, దక్షిణాది చిత్రా లలో మలయాళ చిత్రం తకజి శివశంకర్ పిళ్ళై రాసిన నవల ఆధారంగా తీసిన చెమ్మీన్ మొట్టమొదటి సారిగా ఆ గౌరవాన్ని గెల్చుకున్న సంగతి గుర్తుంది కదా.. ఆ స్థాయిలో సంపూర్ణమైన హొదాతో ఉత్తమ చిత్రంగా తెలుగు సినిమా ఇంతవరకూ **'గోల్డ్‌మెడల్'** సంపాదించలేకపోయింది! ఉత్తమ నటుడుగా జాతీయ స్థాయిలో ఏ తెలుగు నటుడూ అవా ర్డు గెల్చుకోలేదు. అయినా మనం చింతించనక్కరలేదు. చిత్రాల సంఖ్యలో మనమే ముందున్నాం కదా!వెనకటికో తెలుగు దర్శకుడు నిస్సిగ్గుగా ప్రకటించాడు **"సత్యజిత్ రాయ్ లాగా మేము సినిమాలు తీయలేక కాదు. కానీ మాకు అలా తీయడం ఇష్టం లేదు"** అని సత్యజిత్‌రాయ్ నానా కష్టాలు పడి తీసిన మొదటి చిత్రం విభూతి భూషణ్ బెనర్జీ నవల ఆధారంగా తయారైన 'పథేర్ పాంచాలి' ఆ చిత్రం ప్రపంచంలోని ప్రసిద్ధి చెందిన పది అత్యుత్తమ చిత్రాల లో ఒకటిగా భారతీయ సినిమాకు ఓ ప్రత్యేక గౌరవాన్ని తెచ్చిపెట్టింది. నేటికీ! అరుదైన ఆస్కార్ గౌరవ పురస్కారం కూడా సత్యజిత్ రాయ్‌కు లభించింది. ఆయన చిత్రరంగానికి చేసిన కృషికి దర్పణంగా! 'ఫిలిం అప్రీసియేషన్ కోర్స్! (సినిమాను ఎలా అధ్యయనం చేయాలో, ఉత్తమ సినిమా లక్షణాలు ఎలా ఉంటాయో సినిమా అభిమానులకు తెలియపరచే కోర్సు)లో సినిమా స్టూడెంట్స్‌కు నమూనా చిత్రంగా సాధారణం గా 'పథేర్‌పాంచాలి' చిత్రాన్నే చూపిస్తారు. అలాంటి సినిమాను తీయలేకపోవడం కాదు కానీ తీయడం ఇష్టంలేదు'అని మనవాళ్లు ఎలాంటి సంకోచమూ లేకుండా చెప్పగలరు.

సినిమా సకల కళల సమాహారమనీ, దాని ప్రభావం సమాజంపై బాగా ఉంటుందనీ చాలామంది కళాభిమానులు ఆ ప్రక్రియ మీద అభిమానం పెంచుకుంటారు. 'సినిమా సమాజానికి మేలుకంటే ఎక్కువగా కీడే చేస్తోందని' భావించిన రాజకీయవేత్త సి. రాజగోపాలాచారి కూడా మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై తాను రాసిన చిన్న కథ ఆధారంగా ప్రముఖ దర్శకులు సంగీతం శ్రీనివాసరావు 'దిక్కట్ర పార్వతి' అనే తమిళచిత్రం తీస్తానంటే అందుకు అనుమతి ఇచ్చారు. కారణం సినిమా ధోరణుల మీద కోపం ఉన్నా, దాని ప్రభావం మీద ఆయనకు 'నమ్మకం' ఉంది మరి.

కవులు, రచయితలు ఇంకా ఇతర రం గాల ప్రముఖులు చాలా మందికి సగటు సిని మా మీద 'అయిష్టత' ఉన్నా, అంతరాంతరా ల్లో ఈ మాధ్యమం మీద అభిమానం ఉంటుంది. అందుకు ఉదాహరణంగా ప్రముఖ కవి ఆప్కారి సూర్యప్రకాశ్‌గారు చలన చిత్రాలపై వెలువరిస్తోన్న ఈ విశ్లేషణాత్మక వ్యాసాల సంపుటి ఆయనలోని అభిరుచికి అద్దం పడుతోంది. అందుకే ఈ **'అభినందన మందారమాల'**.

కళాత్మక దృష్టితో తయారయ్యే చిత్రాలు తెలుగులో విరివిగా ఎందుకు రావడం లేదనే అంశాన్ని విశ్లేషణ చేయడానికి ముందు మన చిత్రరంగంలోని పరిస్థి తులను బాగా ఆకళింపు చేసుకోవాలి. **'దిగజారుడు తనం'** ఎలా ప్రారంభమవుతుందో, అందుకు సామా జికపరమైన, వ్యాపారపరమైన అంశాలు ఎలా దోహదం చేస్తాయో అర్థం చేసుకోవాలి.

బెంగాలీ, మలయాళం, వంటి కొన్ని ప్రాంతీయ భాషల్లో ఎక్కువగా తయారయ్యే **'క్వాలిటీ'** చిత్రాలతో పోల్చిచూసుకు న్నప్పుడు-స్థాయిపరంగా మనం వెనకబడి ఉండడానికి గల కారణాల్లో-రాష్ట్ర ప్రభుత్వం చిత్రరంగంపై చూపే అలసత్వం కూడా ఒకటి. ప్రజలలో కళలపట్ల ఉత్తమాభిరుచులు పెంచే బాధ్యత ప్రభుత్వానికి ఉంది కదా. మరి ఎందుకు శ్రద్ధ చూపరంటే, అందుకు కొందరు వినిపించే వాదం ఇది- "జనంలో చైతన్యం వస్తే, పాలనలో ఉండే లోటుపాటు అందరికీ తెలిసిపోతాయి. నిరసనలు వెల్లువెత్తుతాయి. అప్పుడు పాలకుల ఉనికికే ప్రమాదం ఏర్పడవచ్చు. అందువల్ల జనం ఎప్పుడూ 'మత్తు' లో ఉండడమే పెట్టుబడిదారీ వ్యవస్థకు శ్రేయస్కరం. కాబట్టి ఆ మత్తు ఏ మత్తు రూపంలో ప్రజలకు సరఫరా అవుతున్నా, పరోక్షంగా ఆ ధోరణులను వాళ్లు ప్రోత్సహిస్తూనే ఉంటారు."

ఆ మాటకొస్తే 'మనం అప్పుడప్పుడు మంచి చిత్రాలు తీస్తూనే ఉన్నాం' కదా అని వాదిం చేవారూ ఉంటారు. అస్సలు మంచి చిత్రం అంటేఏమిటి? శ్రీశ్రీ ఎప్పుడో చెప్పారు. **"కది లేదీ కదిలించేదీ పెనునిద్దుర వదిలించేది, మునుముందుకు నడిపించేదీ'** గా కవిత ఉండాలన్నారు. అది సినిమాకు- అసలు ఏ ప్రక్రియకైనా వర్తిస్తుంది. విక్టోరియా డెసికా తీసిన **'బైసికిల్ థీవ్స్'** ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది సినిమా కళాకారుల్ని ప్రభావితం చేసింది. అందులో సినిమాకు సంబంధించిన ఎలాంటి విచిత్ర ప్రయోగాలు, గిమ్మిక్కులూ, భారీ సాంకేతిక హంగులూ లేవు. ఆ చిత్రం ఇవాళ చూసినా, 'కదిలిస్తుంది'. అటువంటి సినిమాలు రావాలని అభిరుచిగల సినిమా లు రావాలని అభిరుచిగల సినిమా ప్రియులు ఎప్పుడూ కోరుకుంటారు.






**ప్రతులకు:** ఆప్కారి సూర్యప్రకాశ్,
సత్యవీణ, ప్లాట్ నెం.33,
ఇ.నెం.8-7-195/5 పి.వి.ఎన్‌క్లేవ్,
సమతనగర్, ఓల్డ్ బోయినపల్లి,
సికింద్రాబాద్-500012.
సెల్: 9550993232

**"జనంలో చైతన్యం వస్తే, పాలనలో ఉండే లోటుపాటు అందరికీ తెలిసిపోతాయి. నిరసనలు వెల్లువెత్తుతాయి. అప్పుడు పాలకుల ఉనికికే ప్రమాదం ఏర్పడవచ్చు. అందువల్ల జనం ఎప్పుడూ 'మత్తు' లో ఉండడమే పెట్టుబడిదారీ వ్యవస్థకు శ్రేయస్కరం. కాబట్టి ఆ మత్తు ఏ మత్తు రూ పంలో ప్రజలకు సరఫరా అవుతున్నా, పరో క్షంగా ఆ ధోరణులను వాళ్లు ప్రోత్సహిస్తూనే ఉంటారు."**

ఇంకా మంచి సినిమాలు, అత్యుత్తమ చిత్రాల లక్షణాల వంటివి వివరంగా తెలుసు కోవడానికి, జాతీయ స్థాయిలోను, అంతర్జా తీయ స్థాయిలో ఉత్తమ చిత్రాల నిర్మాణం ఏ విధంగా జరుగుతుందో ఒక కనీసపు అవగా హన ఏర్పరచుకోడానికి పూనే ఫిలిమ్ అండ్ టివి ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహింపబడే **'ఫిలిమ్ అప్రీసియేషన్ కోర్సు'** ఎంతగానో దోహదం చేస్తుంది.

అసలు మంచి చిత్రాల నిర్మాణానికి ఏయే పరిస్థితులు అవరోధంగా నిలుస్తున్నాయనే అంశాలు తెలుసుకోవాలంటే, కొంతైనా ప్రత్యక్ష పరిశీలన అవసరం. నిబద్ధతతో మంచి సినిమాలు తీయాలనే దర్శకనిర్మాతల ధోరణి ఒకలా ఉండదనీ, సినిమా పట్ల ఎలాంటి అవగాహనా లేకుండా ఒక రూపాయి పెట్టుబడి లో పది రూపాయల లాభం సంపాయిం చడానికి అడ్డదార్లు వెతికేవారి ఆలోచనా ధోరణి మరొకలా ఉంటుందనీ అప్పుడే మనకు అర్థమౌతుంది. అప్పుడు సినిమాపట్ల మనలో ఉండే చాలా సందేహాలు పటాపంచలవుతాయి. 'ఆనంద తాండవం', హృద యాంజలి వంటి విభిన్న, తరహా సినిమాలకు స్క్రిప్టు రచయితగా పనిచేసిన అనుభవంతో (ఇందులో, హృదయాంజలి, చిత్రానికి నాలుగు నంది అవార్డులు లభిం చాయి. ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ ఛాయా గ్రహణం, తృతీయ ఉత్తమ చిత్రం, ఉత్తమ శబ్ద గ్రహణం మరికొన్ని చిత్రాలకు పాటలు రాసిన అనుభవంతో ఆ తేడాలను చూసి అస్మదీయుడు తెలుసుకున్న విషయం ఇది.

ఒక సందర్భంలో స్క్రిప్టు రచయితల గురించి ప్రస్తావిస్తూ సూర్యప్రకాశ్‌గారు "తన అనుమతి లేకుండా స్క్రిప్టును మార్చడానికి రచయిత ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరిం చరాదు" అన్నారు. అటువంటి ఆదర్శ సూత్రా లు మంచివే కాని ఆదరణలో సినీ రచయిత పరిస్థితి ఎలా ఉంటుందో చూసి తీరాలి.

ఇవాళ్టి సగటు సినిమాల స్క్రిప్టులు ఎలా తయారవుతున్నాయి? కథ హీరో చుట్టూ తిరగాలి. అందుకు నిర్మాతలు, దర్శకులు, కథా రచయితలు మంచి మంచి విదేశీ చిత్రాల సీడీల చుట్టూ తిరగాలి. అటువంటివి దొరికితే, నలుగురైదుగురు రచయితలు వాటి మీద 'కుస్తీ' పట్టాలి లేదా 'కసరత్తు' చేయాలి. అలా కలగాపులగంగా ఓ కథ తయారైతే అది హీరో గారికి నచ్చాలి. నచ్చకపోతే మళ్లీ కథ మొదటికొస్తుంది.

సరే- కథ ఓ పట్టాన ఒకే అయితే, ఒక స్క్రిప్టు రచయితల 'కసరత్తు' మొదలవుతుంది. (వీళ్లలో కొందరు 'ఘోస్ట్' రచయిత లుంటారు) హీరోగారి 'స్టైల్'కు అనుగుణంగా సంభాషణలు రాయాలి. ఆయన సంభాషణల్లో వొత్తులు పలకలేని వాడైతే (అదే నా స్టైల్ అంటాడు ఆ హీరో- ఒక వేళ తప్పుగా పలికినా), అటువంటి 'కఠినమైన' డైలాగులు రాయకూ డదు. ఇలా హీరో దగ్గర్నుంచి, నిర్మాత, దర్శకుడు. వాళ్ల సన్నిహిత మిత్రులు, ఇలా అందర్నీ సంతృప్తి పరచేలా, సీన్లు, సంభాషణలు రాయగలిగి ఉండాలి. వాటిని ఎప్పటికప్పుడు మార్చగలిగేవాడు. ఏమార్చ గలిగే వాడూ అయ్యి ఉండాలి! అదీ వాస్తవిక పరిస్థితి!

"వ్యాపారాత్మక చట్రానికి లోబడికూడా కళాత్మక విలువలను పరిపోషించిన ఆర్యన్ వెల్స్,రాజ్‌కపూర్, మణిరత్నం' అని ఒక చోట అంటారు సూర్యప్రకాశ్ గారు. ఆర్యన్‌వెల్స్‌కు- రాజ్‌కపూర్, మణిరత్నాలకూ పోలికేమిటి? అసలు 'వ్యాపారాత్మక చట్రం' ఏమిటి? ఆ వ్యాపారాత్మక చట్రం గురించి తెలిసిన వారైతే రాజ్‌కుమార్, మణిరత్నం తీసిన అన్ని సినిమాలూ వ్యాపార రీత్యా విజయం సాధించి ఉండాలి కదా? మరెందుకు సాధించలేదు.

సినిమా రచయిత గతంలో ప్రేక్షకాభి మానం సాధించిన ఫార్ములాను పునఃసమీక్షి స్తాడు" అన్నాడు రచయిత మరో చోట. ప్రేక్షకాభిమానం సాధించిన ఫార్ములా అనేది అసలు ఉందా? ఒకవేళ నిజంగా అవే ఒక 'ఫార్ములా' అయితే, ఆ సూత్రాల ప్రకారం తీసిన అన్ని సినిమాలూ ఎందువల్ల బాక్సా ఫీసు వద్ద విజయవంతం కావడం లేదు? ఇటువంటి చర్చనీయాంశాలు కొన్ని ఈ పుస్తకంలో ఉన్నాయి.'అసలు ఉత్తమ చిత్రాలు ఎలా ఉండాలి? ఏవి ఉత్తమ చిత్రాలు? ఏవి కావు? వంటి ప్రశ్నలకు జవాబులు అడిగితే ఎవరి ధోరణిలో వారు చెబుతారు. కాని అటువంటి అంశాలపై విశ్లేషణ జరగాలంటే, అందుకు సూర్యప్రకాశ్ గారి వంటి సినిమా అభిమానులు చొరవ తీసుకోవాలి. ఈ పుస్తకం అటువంటి ప్రయత్నాలకు దోహదపడేలా రూపొందింది. అందుకు రచయిత అభినందనీఉలు. ఆయన విమర్శలను 'స్పోర్టివ్'గా తీసుకునే సహృద యులు కాబట్టి, వ్యాసాల్లో వ్యక్తం చేసిన కొన్ని భావాలను 'చర్చనీయాంశాలుగా' చేసే దృష్టితో విమర్శించడం జరిగింది. అది కూడా అందరినీ ఆయా అంశాలపై ఆలోచించమని చెప్పడానికే!'గొప్ప ప్రేక్షకులు ఉంటేనే గొప్ప సిని మాలు వస్తాయి' అని ఓ సినిమా పండితుడ న్నాడు. మరి ఆ గొప్ప ప్రేక్షకుల సంఖ్య పెరగడానికి అందరూ మార్గాలు అన్వేషిం చాలి. అడపాదడపా గొప్ప సినిమాలు తీయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆప్కారి సూర్యప్రకాశ్‌గారి వంటి మేధావులు సినిమా ప్రక్రియపట్ల ఆసక్తి చూపిస్తూ రచనలు చేస్తూ, ప్రేక్షకుల్లో అభిరుచిని పెంచడానికి కృషి చేస్తున్నారు. 'హైద్రాబాద్ ఫిలింక్లబ్' వంటి సంస్థలు ఉత్తమ స్థాయి చిత్రాల ప్రదర్శనకు కృషి చేస్తున్నాయి. చిత్రరంగంలోని అభిరుచిగల కొందరు పెద్దలు మంచి మంచి పరిణామాలు తీసుకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంతమంది ఇన్ని విధాలుగా కృషి చేస్తున్నప్పుడు తెలుగు సినిమాకు తప్పకుండా మంచి రోజులు వస్తాయి మరి!



- బి.కె.ఈశ్వర్
సెల్:

# ఎవరైనా కవులు కావచ్చు











## అమరావతి సాహితీ మిత్రులు దశమ వార్షికోత్సవ సభలో డాక్టర్ రావి రంగారావు

ఆసక్తి ఉంటే ఎవరైనా కవులు కావచ్చునని "అమరావతి సాహితీ మిత్రులు" సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగా రావు తెలియజేశారు. గుంటూరు బ్రాడీపేట తాలూకా ఆఫీసు ప్రాంగణంలోని పెన్షనర్ల అసోసి యేషన్ హాలులో ఈనెల 16వ తేదీ ఆదివారం ఉదయం **"అమరావతి సాహితీ మిత్రులు"** దశమ వార్షికోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ రంగారావు ప్రసంగిస్తూ పుట్టుకతోనే కవులు అవుతారనేది పూర్తి సత్యం కాదని, సరైన శిక్షణ, సూచనలు, సహకా రం అందిస్తే ఉత్సాహం ఉన్న ఎవరినైనా కవులుగా తయారు చేయవచ్చునని ఆయన చెప్పారు. గుంటూరులో అమరావతి సాహి తీ మిత్రులు సంస్థ స్థాపించిన ఈ పది ఏళ్లలో ఎంతోమంది కాలక్షేపంగా చూద్దామని వచ్చిన వాళ్లు సైతం కవులయ్యారని ఆయన తెలియజేశారు. సంస్థ స్థాపించినప్పటి నుంచి ఈ 10 ఏళ్లలో తయారైన 17 మంది కవులు 20 పుస్తకాలు ప్రచురించి గ్రంథావిష్కరణ జరుపుకున్నారు.

చల్లా సత్యవతి రచించిన **"స్వప్నాలూ, సత్యాలూ"** వచన కవితల సంపుటిని, పగడాల వెంకటరెడ్డి రచించిన "పగడాల పదాలు" మినీ కవితల సంపుటిని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ ఆవిష్కరించారు. పరుచూరి కృష్ణ భార్గవి రచించిన **"వెన్నెల తరంగాలు"** వచన కవితల సంపుటిని, గోలి మధు రాసిన **"మధు కిరణాలు"** మినీ కవితల సంపు టిని ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జి. వి. పూర్ణ చందు ఆవిష్కరించారు. డాక్టర్ సూర్యదేవర రవికుమార్ రచన **"వజ్జాల గ్గము"** శతకాన్ని, లంక మాధవి రచించిన **"భక్తి తరంగాలు"** గేయాల సంపుటిని ప్రముఖ సాహితీవేత్త డా. గుమ్మా సాంబశివరావు ఆవిష్కరించారు. వసుధ బసవేశ్వర రావు రాసిన **"పసి గేయాలు"** బాల గేయాల సంపుటిని, డాక్టర్ మైలవరపు లలితకుమారి రాసిన **"లలిత బాలకథలు"** కథల సంపుటిని "నేటి నిజం" సంపాదకులు బైస దేవదాసు (హైదరాబాద్) ఆవిష్కరించారు. పేర్లి దాసు రచించిన **"వెలుగు బాట"** శతకాన్ని ప్రముఖ సాహితీవేత్త జెల్ది విద్యాధర్ ఆవిష్కరించారు. గడల శివప్రసాద్ రచన **"చెరుకు గడల రతనాలు"** వచన కవితల



"అమరావతి సాహితీ మిత్రులు" సంస్థ దశమ వార్షికోత్సవ సంచిక "సాహిత్య కళాశాల" ఆవిష్కరణలో తమ్మా ధనుంజయరెడ్డి, జెల్ది విద్యాదర్, డా॥రావి రంగారావు, రావి ప్రభావతి, డా॥టి. సేవకుమార్, జి.వి.పూర్ణచందు, డా॥పాపినేని శివశంకర్, డా॥ గుమ్మా సాంబశివరావు, వి.బి.ఆచార్యులు, బైస దేవదాసు, కలిమిశ్రీ, శ్రీనివాస్, డా॥రావి అరుణ.

సంపుటిని **"నవ మల్లె తీగ"** సంపాదకులు కలిమిశ్రీ ఆవిష్కరించారు. వి. వి. రావు రచన **"చైతన్య చంద్రికలు"** మినీ కవితల సంపుటిని, ఓలేటి ఉమా సరస్వతి రచించిన **"చిత్ర సౌరబాలు"** పద్య సంపుటిని



అతిథులతో కవులు, కవయిత్రులు

ప్రముఖ సాహితీవేత్త బంగారు వి. బి. ఆచార్యులు ఆవిష్కరించారు. గోలి హనుమచ్ఛాస్త్రి రచించిన **"మినీ గోలీ"**ల ను, **"మెరుపు గోలీ"**లను డాక్టర్ టి సేవ కుమార్ ఆవిష్కరించారు. అమరావతి సాహితీ మిత్రులు దశమ వార్షికోత్సవ సంచిక **"సాహిత్య కళాశాల"**ను కూడా సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి. సేవ కుమార్ ఆవిష్కరించారు.

అయినాల మల్లేశ్వరరావు **"సూక్తి సుధ"**ను ప్రముఖ సాహితీవేత్త డా. రమణ యశస్వి ఆవిష్కరించారు. తుమ్మల సాంబశివరావు రచించిన **"పూలు ముళ్ళు"** మినీ కవితల సంపుటిని, తమ్మా ధనుంజయ రెడ్డి రచించిన **"అక్షర తూణీరాలు"** మినీ కవితల సంపుటిని, సంబరాజు రమణి రాసిన **"రమణీయాలు"** మినీ కవితల సంపుటిని సంస్థ అధ్యక్షులు డా॥ రావి రంగారావు ఆవిష్కరించారు. **"అద్దంలో సమాజం"** కథానికల సంపుటిని దేశరాజు వెంకట కృష్ణమూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, డా॥ లలిత కుమారి, తాటికోల పద్మావతి, డా॥ రావి రంగారావు అన్ని గ్రంథాల గురించి గ్రంథ సమీక్షలు చేశారు.

సభలో ముఖ్య అతిథి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కవులు కవిత్వం నిరంతరాయం రాస్తూనే ఉండాలని మంచి కవిత్వం చదువుతూ సాధన చేయాలని సూచించా రు.

1980 ప్రాంతంలో మినీ కవిత ను ఒక ప్రత్యేక ప్రక్రియగా గుర్తించి రావి రంగారావు **"భారతి"** మాస పత్రికలో మినీ కవితకు ఒక విశిష్ట స్థానం కల్పించారని ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డా.జి. వి. పూర్ణ చందు (విజయవాడ) అన్నారు. మినీ కవితను ఒక సృజనాత్మ ఉద్యమంగా భావించి తాను, రావి రంగారావు దేశమంతటా పాఠశాలలలో, సాహిత్య సంస్థలలో... అనేక కార్యక్ర మాలు నిర్వహించి మినీ కవితను వెలుగులోకి తెచ్చామని తెలియజేశారు. సాహిత్యం పట్ల అంకితభావంతో కృషి చేస్తున్న చాలా తక్కువ సాహిత్య సంస్థలలో **"అమరావతి సాహితీ మిత్రులు"** విశిష్టమైన దని, వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిర్వహిస్తూ నిర్మాణాత్మక సూచనలు చేస్తూ రచనలను దిద్ది సరియైన రూపాలను అందించటం కూడా సంస్థ విశిష్టత అని రావి రంగారావు కృషిని కొనియాడారు.

పద్యం, వచన కవిత, గేయం, మినీ కవిత, కథ ఎలాంటి ప్రక్రియనైనా అలవోకగా రాయగలిగే నైపుణ్యం ఉన్న రంగారావు కొత్తవారిని, యువకులను దగ్గరకు తీసి ఉత్తమ కవులుగా, రచయితలుగా తీర్చిదిద్దటం ప్రశంసనీ యమని ప్రముఖ సాహితీవేత్త డా. గుమ్మా సాంబ శివ రావు (విజయవాడ) వివరించారు.

కవిత్వం మనిషి ని మనిషిగా నిలబడుతుందని, అందుకు రావి రంగారావు కవులను తయారు చేయడం అభినందనీయమని "నేటి నిజం" పత్రిక సంపాదకులు బైస దేవదాసు అభిప్రాయపడ్డారు.

సంస్థను నిర్మాణా త్మక మార్గంలో నడిపిస్తూ ప్రతిఫ లాపేక్ష లేకుండా సాహిత్య సేవ చేయడం అనేది గొప్ప విషయం అని ప్రముఖ సాహితీవేత్త డా. జెల్ది విద్యాధ రరావు భావించారు. ఇంకా ఈ సభలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సేవకుమార్, ప్రముఖ సాహితీవేత్త బంగారు వి. బి. ఆచార్యులు (హైదరా బాదు), "నవ మల్లెతీగ" సంపాదకులు కలిమిశ్రీ (విజయవాడ) మొదలైన వారు ప్రసంగించారు.

కవుల్ని, అతి థుల్ని "అమరావతి సాహిత్య మిత్రులు" సంస్థ అధ్యక్షులు డా. రావి రంగారావు, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి. సేవకుమార్ జ్ఞాపికలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

పింగళి భాగ్యలక్ష్మి స్వాగతం పలికారు. కొలకలూరి దేవికారాణి రత్నాకర్ పాడిన "ఆంధ్ర ప్రదేశ్ గీతం" , జయ మాధురి, కృష్ణ భార్గవి పాడిన సంస్థ గీతం శ్రోతలను విశేషంగా అలరించాయి. రావి రంగారావు సాహిత్య పీఠం డైరెక్టర్ డా॥ రావి అరుణ అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. తమ్మా ధనుంజయ రెడ్డి సభను జనరంజకంగా నడిపించారు. ●
















### అక్షరాలు

అక్షరాల్ని
మట్టిలో విత్తాను
పంటలుగా మారాయి.

అక్షరాల్ని
నేలమీద కురిశాను
కాల్వలు నదులుగా ప్రవహించాయి.

అక్షరాల్ని
ఆకాశంలో విసిరాను
సూర్య చంద్ర నక్షత్రాలుగా వెలిశాయి.

అక్షరాల్ని
నా గుండెలో ప్రతిష్టించుకున్నాను
నేను మనిషినయ్యాను.



-డా॥రావి రంగారావు
9247581825






### కణిక



సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ



### నిలబడాలి

చేతిలో చరవాణులతో లైకుల లోకంలో బంధీలవుతూ..
కళ్ళలో కలలు నింపుకుని ఊహా లోకాల్లో తేలియాడుతూ..
గుడ్డివారవుతున్నారు కళ్ళెదుట కనిపించే కన్నవారి ప్రేమను కాలదన్నుతూ...
వ్యసనాల బారిన పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటూ..
బాధ్యతలను వదిలి దారీతెన్నూ తెలియక తడుముకుంటూ..
గడుపుతున్నారు తిరిగి తీలుకురాలేని కాలాన్ని వృథా చేసుకుంటూ. ..
స్వార్థం నిలువెల్లా నింపుకుని పక్కవాడికేమైతే నాకేంటనుకుంటూ...
అసూయ, ద్వేశాల మంటల్లో ప్రశాంతతను పోగొట్టుకుంటూ...
జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు కోపతాపాలు తెచ్చుకుంటూ...
అలవికాని ఆశల సౌధాలను నిర్మించుకుని, నిరాశలో మునిగలేక...
గెలుపుకై ఆరాటపడుతూ ఓటమిని జీర్ణించుకోలేక..
చిన్న విషయాలకే ప్రాణాలు తీసుకుంటున్నారు బ్రతకలేక...
యువతా! మేలుకో! నీలో వుంది చరిత్రని తిరగరాసే సత్తా ...
నువ్వే వివేకానందుడు కోరుకున్న అమేయ శక్తి..
నువ్వే కలాం కలలు గన్న యువ శక్తి...
లే! నిలబడు దేశపుసరిహద్దుల్లోని సైనికుడిలా..
ముందడుగు వెయ్యి ఏదైనా సాధించగల యువ కిశోరంలా...

-జి. మధు మురళి, హన్మకొండ

### నేటి వైకుంఠపాళీ

యువతను కట్టుబానిసలుగా మార్చే మద్యపాన మత్తు
యువత భవితను నిలువునా కూల్చే మాదకద్రవ్యాల మత్తు
ఇవిగాక ఇప్పుడు కొత్తమత్తుకు అలవాటై చరవాణులకు అవుతున్నారు తొత్తు
ఒక్కసారి అలవాటైతే ఇంద్రజాలంలా చేస్తుంది గమ్మత్తు
సరదా కోసమైనా వీటిలో ఏ ఒక్కటీ పెట్టుకోకండి పొత్తు
ఆనక యువత భవిష్యత్తును చేస్తుంది చిత్తు చిత్తు.
జీవితంలో దిగజారుడుతనానికి తొలిమెట్టై
జీవనాన్ని పతనావస్థకు చేర్చే పనిముట్టై
కన్నవారి కలల సౌధాన్ని కూల్చే గొడ్డలిపెట్టై
బ్రతుకు చిత్రాలని సమూలంగా కాల్చే కొరివికట్టై
చాపకింద నీరులా వ్యాపించి
యువతను పతనావస్థకు చేరుస్తుంది
నిచ్చెనల నుండి పడదోసి,
పాముల పాల్జేసే వైకుంఠపాళై మిగులుతుంది.
నేడు ప్రతిఇల్లు ఏదో ఒక మత్తుకు లోబడింది
పాశ్చాత్య పోకడలతో సమాజమే ఇలా తగలబడింది
ఇపుడైనా మేలుకోండి... ఇకనైనా కోలుకోండి
మత్తు చిత్తుకు గమ్మత్తుగా తొత్తు కాకుండా
నియంత్రణతో నిఖార్సైన మనిషిలా ఎదగండి
నవ జీవితానికి వారధులుగా నిలవండి
దేశ సౌభాగ్యానికి సారథులుగా మిగలండి
భావి భారత పౌరులకు ఆదర్శంగా వెలగండి.

-ఎస్. రత్నలక్ష్మి
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
జలవనరుల శాఖ

### నిలదొక్కుకొనే వయసు

జీవితంలో మనిషిగా నిలదొక్కుకోవడానికున్న దశ యవ్వనం.
యువతీ యువకులు ఎంచుకునే దిశకు దశ నవయౌవనం.
బాల్య కౌమార దశలను దాటాక వస్తుంది జవ్వనం.
మంచి తీరు అనుసరిస్తే కడ దాకా ఉంటుంది అవనం.
నేటి యువత దారి ఎటు!
వారి బాటకు పునాది వేసి నడిపించిన తీరెలా ఉందో!
తీరు బాగుండీ ఫలితాలు బాగుండీ ...
అదృష్టవశాత్తూ మంచి అవకాశాలు యువతను వరిస్తే ...
ప్రపంచంలో పెరిగిన సాంకేతిక విజ్ఞానంతో పోటీ పడతారు.
అత్యున్నత స్థానాలను అందుకోవడానికి ...
మంచి ఉపాధిని చేపడుతారు.
ఉద్యోగాలైనా కావచ్చు.
వృత్తులైనా కావచ్చు.
వ్యాపారాలైనా కావచ్చు.
వారెన్నుకొన్న రంగంలో ...
ఆటుపోటుల అనుభవంతో నిలదొక్కుకొని;
కన్న తల్లిదండ్రులకూ, దేశానికీ మంచి పేరు తెస్తారు.
చెడు అలవాటుల వలన తీరు మారనూ వచ్చు ..
దారి తప్పనూ వచ్చు.
దొరికిన అవకాశాలతో తృప్తి పడక ...
ఇంటిపేరు చెడగొట్టి
దేశాభివృద్ధికి ఆటంకమైతే ...
కఠిన పద్ధతులలో వారిని తీర్చిదిద్దక తప్పదు.

-విత్తనాల విజయకుమార్ ,
9985117789

### మదిలోమెదిలే..

మదిలో మెదిలో భావాలెన్నో
మదనోత్సాహితములై
మరలమరల
మనసున తుళ్ళుచూ
మనసరికై మరమరి వేచె.
కలయో నిజమో తెలుపక
కాముని శరములై కలకలము రేపుచూ
కన్నెమనమును దోచు
కన్నయ్య కై కనులింత చేసె.
వలదని వారించిననూ వినక
వదలను నిను అనుచు
వయ్యారములు పోవుచూ
వల్లీ సనాథుడేడని అల్లరిచేసె.
చెంత చేరిన చెలుని చూడగనే
చింతదీరె నాకనె చెలియ.
కాంతుడు దరిచేర
కమనీయమాయె కన్నె మది.
మాలతీమాధవము చెంత
మాలతీ మాధవులిరువురు
ఏకమవగ
మాలలల్ల మల్లెజాజి సంపెగ
మరలిపోయె
మబ్బు మరిక సెలవనుచు.

-డా. కె. శైలజ
90084 79629

### కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది.
అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

### జీవిత పాఠం

కాల సూచిక చెబుతున్నది
జీవిత కాలం ఎంత చిన్నదో...
శిశువు తో మొదలు జీవిత ప్రయాణం...
తెలియకుండానే గడిచిపోవు శిశు ప్రాయం.
నాలుగేళ్ల వయసు నుండి బాల్యం...
ఆటపాటలతో మాయం
ఆపై చదువుల పోరాటాల మయం
మధ్యలో కాటేసేను గా యవ్వన సర్పం
జారుకునేను కలల ప్రపంచం లోకి హృదయం.
పొట్టకూటికై కావాలి ఏదో ఒక జీవనాధారం
దినమంతా ఉద్యోగ విధుల్లో లీనం
"ఏడేడు జన్మల నుండి పడిఉంది బ్రహ్మ ముడి"
వీడక పెనవేయును వివాహ బంధం
మేమూ ఉన్నామంటూ మధ్యలో
ఊడిపడేను సంతాన పర్వం
మునిగి ఈదక తప్పదు సంసార సాగరం..
బాధ్యతల,బరువుల సుడిగుండం.
హారతి కర్పూరం లా కరిగేను జీవిత కాలం
వచ్చి పడును వృద్ధాప్యం...
అష్టకష్టాల మయం
జవసత్వాలు ఉడిగిన మలి జీవితం
చివరకు తప్పని మరణం...
ఇదే జీవిత సత్యం
తిరిగి రాదు గతించిన కాలం
చాలా విలువైనది ప్రతి క్షణం
వ్యర్థం కానీక చేసుకో మంటున్నది సార్థకం...
ఒక్కరోజులో నేర్పించే
కాల సూచిక జీవిత పాఠం...

-సరస్వతి నంద్యాల
94904 82795

### అగుపిస్తున్న నిజాలు నమ్మవద్దు

రీల్ లో ఎదుట అగుపిస్తున్న
నిజాలని నమ్మవద్దు
కష్టాలు కన్నీళ్లు వెతలు
ఎన్నెన్ని ఉన్నాయో ఎవరికి తెల్సు?
ముద్దూ ముచ్చటగ కల్పిస్తున్న
వెలుగు చూసి భ్రమించకు?
మదిలో మెదిలే వేదన ఆవేదన
లున్నా ముస్తాబు చేసుకుని
అగుపిస్తున్న చిత్రం
అతుకుల బతుకుల చీకట్లు
అతుకుల
ఫ్లాష్ లైట్ల కాంతిలో నటనద్భుతం
రీల్ లో లైకులు కోసం పడే తపన
అనేక సంఖ్యలు చూసి కొనినా
రంగు రంగులుద్భ వించే రూపాలవి
వాస్తవాలకు అతీత దూర ప్రాంతాలలో నిలిచేవి!.
రీల్ లైఫ్ లో ఆనందంగా చూసినా
రియల్ లైఫ్లో రానే రాదు
ప్రస్తుత సమాజంలో ప్రశాంతత
కావాలన్నా నిన్ను నీవు తెల్సు
కో గలగాలి ఒత్తిడి లైఫ్ లో
ఏర్పడితే ముఖ్యం యోగా ధ్యానం!

-డా॥ పోట్నూరి సింహాచలం
79956 81836

### వానొచ్చింది - సంతోషం తెచ్చింది.

రాగాల పల్లకి లో మనసు ఊయలూగు వేళ
సంగీత ఝరిలోని మురిపాల మకరందం
లేలేత చిగురాకుల్లా మది పొరలను నిమురుతూ
మధుర భావనలను హృది నిండా నింపే తరుణం..!!.
చిటపట చినుకులతో మొదలైన మబ్బుల వాన లో
భువిలో వేడిని చల్లార్చి తడపగలిగే ప్రకృతి స్నానం
పచ్చదనపు మొక్కలన్నీ తేజస్సును నింపుకుంటూ
త్రొంగి చూసే ఇంద్రధనసుతో సంభాషించే సమయం..!!.
ప్రకృతమ్మ సోయగాలు ఎటు చూసినా సంబరాలు
మట్టి వాసనతో భూమాత మంగళ స్నానం లా
పూరెమ్మల పకపకల చిరునగవుల అందమైన దృశ్యం
కాగితం పడవలతో బుడి బుడి అడుగుల పిల్లల ఆనంద హేల..!!
చూస్తుంటే చూస్తూనే ఉండాలనిపించే దృశ్యమే రమణీయం
మండే ఎండలతో విసిగి వేసారిన జనులకు పండుగ వాతావరణం
ఎండిన రైతన్న ఆశలకు పచ్చ జండా ఊపిన వర్షం
నీటి కొరతతో ఉన్న పట్టణ వాసులకీ హర్షాతిరేకం..!!

-డా. సరికొండ శాంతిశ్రీ.
94920 51932

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1854వ రోజు **'దెయ్యాలు వేదాలు వల్లించినట్టు'** అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. **'దెయ్యాలు వేదాలు వల్లించినట్టు'** అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
**-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,** 9441046839



## వేషధారుల వచనాలు

సత్యపు బాటలు నడిచే వేళలో
ధర్మము నోట పలికే వేళలో
కపట మనస్సుతో కమ్మని మాటలు
చెబుతూ ఉంటే వింతగ తోచునులే.

అధర్మమంతా ఆత్మన ముంచి
వేదాలన్నీ వల్లించుట ఏల?
ముసుగులు తొడిగిన మోసపు బతుకులు
లోకము ముందుట విజ్ఞులవోలె.

హృదయము నందున విషమును దాచినన్
అమృతధారలు చిలకరించినన్
పాముకు పాలను పోసిన పెంచినన్
కల్ల మాటలకు విలువయు లేదు జగతిలోన్.

నీతిని నోట నిలుపుట కాదు
రీతిని నడతన చూపుట మేలు.
కరమున కత్తిని దాచుకొని రీతిన
కరుణ రసమును కురిపించుము.

నమ్మదు లోకము కల్లల రూపులను
గమనించునుగా గుణముల తేడాలను
వేదము వేరని, నడతయు వేరని,
తెలుసుకొనును నిజ తత్వము లోకములోను.

మాటలు వేదము, మనసులు రోతై
సాగుతు ఉన్నది వేషాలట.
నిజమును నమ్మక నిలిచిననాడే
ధర్మానికింక జయము లేదిక!.

**-గుండవరం కొండల్ రావు**

## శ్రీరంగనీతులు!

పదవీ అధికారం
దొబ్బే దాకానే
నీతుల మూటలు
రీతుల హిత వచనాలు
శ్రద్ధా భక్తుల పూజలు.
గుడిలో ప్రదక్షిణలు
ఒంగీ తొంగీ
భక్తీ ప్రవృత్తుల
కుటిలనీతుల కుట్రలతో
గోవిందుని స్మరణ స్తోత్రాలు
నయవంచనలతో
గుడిలో లింగాన్ని
చటుక్కున మింగేసే ప్రబుద్ధులు.
కర్ మే మాలా ఫిరై
జీభ్ ఫిరే ముహ్ మా హీ
చెప్పేది శ్రీరంగనీతులు
దూరేది ఏవో గుడిసెలు
చిత్తం చెప్పుల మీద
భక్తి ప్రసాదం కోసం
పై పై పెదవుల
మాటల కోటలు
చేతలు తప్పిన
వికృత చర్యలు.
రాత్రికి రాత్రే
దాబాల్లో సారా విందులు
డొక్కల బొక్కలను చీకేస్తూ
కుక్క కాటుకి చెప్పు దెబ్బలా
వెనుక తీస్తారు గోతులు
పేదల గుండెల్లో
గునపాలు దించేస్తారు
శ్రమ స్వేదాన్ని
గుటుక్కున త్రాగేస్తారు
మానం మర్యాదను
మంట గలుపుతూ.
ఓట్లను దోచేసి
పార్టీల కుమ్ములాటలు
రాజ్యాంగాన్ని
కాపాడండంటూ
తిట్ల దండకాలు..
పాలన పేరుతో
రక్తం పీల్చే పిశాచాలు
వల్లిస్తున్నాయి
తంత్రాల మంత్రాలు.

**-పి.పద్మావతి**

## ముసుగు తీసి చూడు!

సమాజంలో ఉన్నారు
ఎందరో ముసుగు వీరులు!
ఆ ముసుగులో అగుపిస్తారు
సాధు జనులలా!
ఉపకారానికి
తామే ముందుండేలా నటన!
దొంగే 'దొంగ' అని
అరిచినట్లు నటిస్తారు.
గుడిలో మంత్రాలు
చదువుతూనే పంతులు
వేకువనే లేచి
పూజాదికాలు చేస్తుంటే
ఆ గుడినీ
గుళ్ళో లింగాన్నీ మింగేవారూ
వీధిలో తిరిగి
అందరిని పరామర్శిస్తూ
ఉపకారానికి మించి
ఉసురు తీసేవారూ ఉన్నారు!
వేసేవి తెల్ల దుస్తులైనా
నల్లవాడు లోపల
ఎప్పుడూ దాగి ఉంటాడు!
చేయాల్సిన పని
చేస్తూనే ఉంటాడు!
పాముకాటు
తేలు విషం కన్నా
ప్రమాదం అది!
పగలంతా
పూజలు చేస్తున్నట్లుండి
రాత్రిళ్ళు
చీకులు, చిందులు కానిస్తారు!
దయ్యాలు
వేదాలు వల్లించినట్లు.
ఎన్నో సూక్తులు పలుకుతూ
గోతులు తీస్తారు!
వేదిక నెక్కి
ఎన్నో నిస్వార్థ వచనాలు!
ఆచరణలో పెట్టమంటే
ఆమడ దూరం!
దయ్యాలైనా నయం
రాత్రులు తిరుగుతాయి!
వీళ్ళైతే
రాత్రింబగళ్లు అకృత్యాలే!
పెద్ద మనుషుల్లా
చలామణి అవుతూ
పెదదారులలో
పెను మోసాలు చేస్తారు!
గెలిపిస్తామని ఆశపెట్టి
నిలువునా
వాయిదాలతో ముంచేసే లాయర్లు!
నల్లకోట్లు ధరించి
తిరిగే దయ్యాలే కదా!!.

**-కోలా సత్యనారాయణ**

## దెయ్యాలే మేలు

చెప్పేది శ్రీరంగనీతులు
దూరేది ఏవో గుడిసెలు.
సామెతలు
ఊరికే పుట్టవు.
వాటి పుట్టుకకు
పుట్టెడు ఆనవాళ్లు.
గుళ్ళుగోపురాలు
గుటుక్కున మింగేసి
గోవింద నామాలు
గొప్ప గొంతుతో
అప్పచెప్పే
మానవ రూప దయ్యాలు
ఎందరో మరెందరో.
న్యాయవాదులని పేరు
అన్యాయానికి మారుపేరు
అత్తా కోడళ్ళ మధ్య చేరి
ఇద్దరి ఆస్తి నాస్తి చేసి
తన పేర ఆస్తి
సుస్థిరం చేసుకున్న
నల్లకోట్లు వాదించే
వాదనలు చూసి
విస్తుబోయాను
అటు తర్వాత పోయి
నల్ల కోట్లు
దేవాలయాల్లో పూజలు
అదే కదా
దయ్యాలు వల్లించే వేదాలు.
మనసులో మోయలేనంత ద్వేషం
మాటల్లో తేనె పూసిన వేషం
ఇలాంటివారు
చదివే చదువులకన్నా
ఆ దయ్యాలే వచ్చి
వేదాలు చదివితే ఎంతో మేలు
వాటికి కొంచెం
జ్ఞానమన్నా కలుగుతుంది.

**-డా.సి. వసుంధర**

## వికృతం

విధ్వంసాల విద్రోహాల
అమానుష ప్రవర్తనల
వినాశనాల కానిచ్చి
ప్రజాస్వామ్యమంటూ
ప్రజాశ్రేయస్సంటూ
మొసలి కన్నీటి వేదనలు
ఎన్నికలలో
ఓట్లు దోచుకునేందుకే
అధికారం
మరల చేజిక్కించుకునే
నక్కజిత్తుల సంవాదాలు
రాజకీయ నాటకాలు మాత్రమే
వారు వల్లె వేసే నీతి వచనాలు,
దయ్యాలు వేదాలు వల్లించినట్లే.
భయంకర మారణాయుధాల
వైరాన్ని సమరంగా చేసి
భూతల జలతల,
వాయుసీమల
విధ్వంస నాశనాల
అమాయక ప్రజానీకాన్ని బలిచేసిన
యుద్ధ కాముకులు
విశ్వశక్తి కిరీటాల
అభిలషించే
స్వార్థ నాయకులు,
ఐక్యరాజ్య సమితిలో
మానవహక్కుల సంరక్షణపై
ఉపన్యాసాలివ్వటం...
దయ్యాలు
వేదాలు వల్లెవేయటమే.
వేదాలు
సర్వసృష్టి కొరకు వల్లించడం
దయ్యాలు భయ భ్రాంతుల
సృష్టి వినాశ కాముకులు,
రెంటికీ పొంత విద్దూరమే కదా!
శ్రేయస్సులకు, కళ్యాణాలకు
బహు దూరమే కదా!
కలి ప్రభావాన
కసాయి ప్రవృత్తుల
దయ్యాల చేత
వేదాలు చిక్కిన,
వల్లె వేయుట కాదు
రంకెలు భయంకర కేకలగు
వేద పతనం.
దయ్యాలు వేదాలు వల్లెవేయటం
వికృతమే కదా!.

**-రాజప్ప**

## వేదాల వెలుగు -దయ్యాల చీకటి

వేదాలు వెలుగును
నాటే జ్ఞానదీపాలు
దయ్యాల కథలు
భయపు నీడలు
సత్యమే
వేదాల శాశ్వత స్వరం
అజ్ఞానమే
మూఢనమ్మకాల ఆధారం.శ్రీ
ధర్మమార్గం చూపేది వేదమైతే
భయమార్గం చూపేవి అపోహలే.
జ్ఞాన దీపం వెలిగిన హృదయంలో
చీకటికి నిలయం
ఎప్పుడూ ఉండదు.
వేద వాక్యమే
మనకు మార్గదర్శి
సత్యమే
మన జీవితానికి రక్షక కవచం
వెలుగును ఎంచుకున్న
మనసుకు
చీకటి కథలపై
విజయం నిత్యసత్యం.

**-రజనీ కులకర్ణి**

## అయ్యబాబోయ్!

ఆయ్!
అయ్యబాబోయ్!
దయ్యాలు భూతాలంటా
భయపెడతరేంటి బాబయ్యా..
మనం
మడుసులమే కదా దెయ్యాలం.
పగలంతా అబ్బో!
నీతులు సెప్తాం
రేత్రికి
తడాఖా సూపుతాం!
మడిసి అంటే
నిలువెల్ల విషం
పాముకాటు
జోరీగ పాట
ఉరుకుతుండయ్ మడుసుల
యవ్వారం జూసి.
ఓం అంటా
శాంతిమంత్రాలు
అమ్మోరికి బోనాలు
మొక్కులు
రేత్రికి ముక్కలు
పటపట కొరుకుతా
గటగట కుండలు
ఖాళీ చేసే
వదరుబోతులను జూసి
పరుగో పరుగు
దెయ్యాలు.
చేతిలో జపమాల
తిప్పుతూ
బంగారు కంకణం సేతబట్టి
బాపనయ్య కి
ఆశపెట్టిన
పులికథ ఎరకలేదా?..
సుక్కలు నిక్కినిక్కి చూసెటేల
సీకటిబతుకులు
సిగ్గిడిసిన
మడుసులు
"ఓయ్ పిల్లలూ!
ఇస్కూల్ కి జల్దీ రాకుంటె
బడితె పూజ"
అనే అయ్యోరు
రొప్పుకుంట
మొదటి కలాసు
ఐనంక వచ్చుడు.
దేశం ముందుకెల్లాలంటే
గద్దె మీదున్నోడు దిగాలంటూ
సభల్లో అరుపులు
తోపులాటలు
ఆల్లంతా
మనం ఓటేసి నెత్తికెక్కించుకున్నోల్లం
ఒకరిని ఒకరు
దెప్పుకుంట పైకి
లోన మాత్రం గూడుపుఠాణీలు
మనమే దెయ్యాలం
వేదాలంటే తెలియనోల్లం
నోట్లో వేలు పెడితే కొరకలేనోల్లం.

**-ఎ.రాజ్యశ్రీ**

# బైస దేవదాసు, పొత్తూరి సుబ్బారావు దంపతులకు "వంశీ వందేభారత్" అవార్డుల ప్రదానం



బైస దేవదాసు దంపతులకు, మరియు పొత్తూరి సుబ్బారావు దంపతులకు అవార్డులను ప్రదానం చేస్తున్న వంశీ రామరాజు. చిత్రంలో రేలంగి నరసింహారావు, తదితరులు

హైదరాబాద్, ఆగష్టు 19: వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని ప్రేకోస్ స్టూడియోలో "వంశీ వందేభారత్" అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. సంగీత, సాహిత్య, సాంస్కృతిక రంగాల అభివృద్ధే ధ్యేయంగా సేవలందిస్తున్న పలువురికి ఈ అవార్డులు ప్రదానం చేశారు. సాహిత్య రంగంలో కృషి చేస్తున్న 'నేటినిజం' పత్రిక సంపాదకులు బైస దేవదాసు, శ్రీమతి బైస వీణాదాస్ దంపతులకు, 'సాహితీ కిరణాలు' మాస పత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, జయలక్ష్మి దంపతులకు ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, వంశీ రామరాజులు "వంశీ వందేభారత్" అవార్డులు ప్రదానం చేశారు.

# ప్రశ్న నుండి ప్రశ్న నుండి ప్రశ్నల్లోకి!






- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

మిస్టర్ క్లీన్ హడావుడిగా మా ఇంటికి వచ్చాడు.

"అరేయ్ మేంగో? ఈరోజు మీ స్కూల్ వుందా?" అని అడిగాడు.

"లేదు. నిరసనలు అంట. అది బంద్‌గా మారవచ్చు అని ముందు జాగ్రత్తగా బడులు మూసేస్తున్నాం అని ఇప్పుడే మెసేజ్ అందింది" అన్నాను.

"మొదటి క్వార్టర్ అంతా ఇలానే వుంటుంది. ఇప్పుడు మీ ముగ్గురితో మాట్లాడాలి. అన్యనూ, విదూను రమ్మని ఫోన్ చెయ్యి" అన్నాడు.

"ఏ విషయం గురించి మాట్లాడాలి?" అన్నాను.

"అప్పుడే ప్రశ్నలు మొదలా? ముందు అందరూ రండి" అని వెళ్ళిపోయాడు.

××××××

మేం ముగ్గురం మిస్టర్ క్లీన్ ముందున్నాం.

"ఇప్పుడు ప్రపంచం దేని మీద నడుస్తుంది?" అన్నాడు. మేమందరం ఒకరి ముఖాలు ఇంకొకరు చూసుకున్నాం.

"ఇలాంటి ప్రశ్నలకంటే మా క్లాసు పుస్తకాల్లో ప్రశ్నలకు జవాబులు చెప్పటం ఈజీ. మీరు సిలబస్‌లో లేని ప్రశ్నలు అడుగుతున్నారు. అందులోనూ క్లారిటీ లేదు" అంది అన్య.

"దేని మీద నడిస్తే మనకేంటి. అది అవసరమా. నేను మాటలు మీద నడుస్తోంది. యుద్ధాల మీద నడుస్తోంది. అబద్ధాల మీద నడుస్తోంది. ఇంకా చాలా చాలా మీద మూవ్ అవుతోంది అంటాను. మీరు ఒప్పుకుంటారా?" అన్నాడు విదు.

"చల్ల కొచ్చి ముంత దాచినట్లు, మీరేదో ప్రీచ్ చేయటానికి వచ్చారు. అదేదో చెప్పకుండా ఈ ప్రశ్నల దాడి ఏంటి? మీరే అంటారుగా టీ.వీ. డిబేట్లలో యాంకర్ల ఇంట్రో దాడి వుంటుందని. మీరు ప్రశ్నలు అడగవద్దు. చెప్పదలుచుకున్నది చెప్పండి. అప్పుడప్పుడు అంటారు కదా! తాంబూలాలు ఇచ్చాం, తన్నుకు చావండని."

"మీరు ఇప్పటినుంచే వైల్డ్‌గా తయారవుతున్నార్రా. చిన్న ప్రశ్నకే ఇంతగా తిరగబడతారా?" అన్నాడు క్లీన్.

"ఇది చిన్న ప్రశ్నా! ప్రపంచాన్ని కుదిపేసేది. అయినా ఇలాంటివాటిని మేధావులను అడగాలి. మా దగ్గరేంటి మీ ప్రతాపం" అంది అన్య.

"సరే పిల్లలూ? మీరు పిడుగులు అనుకున్నా. అందుకని అలా అడిగాను. ఇప్పుడు ప్రపంచమంతా ప్రశ్నల మీద నడుస్తోంది. ఈరోజు మన టాపిక్ అది. దాని మీద మాట్లాడుకుందాం."

"మేం మాట్లాడం. మీరే మాట్లాడండి" అన్నాం ముగ్గురం.

"అలాగే మొదలుపెట్టనా?"

"మేం చెవుల్లో పూలు పెట్టుకుని వినట మేనా? మధ్యలో ప్రశ్నలు అడగవచ్చా?" అన్నాను.

"మేంగో - నన్ను మీరు మిస్టర్ క్లీన్ అంటారు. మెంటార్ అంటారు. అవన్నీ మీ హృదయం నుండి వస్తున్న మాటలు కాదా? మీరు కూడా నా మీద తిరుగుబాటు చేస్తున్నారా?" అన్నాడాయన.

"ప్రశ్నలు అడగటం అంటే తిరుగుబాటా?" అంది అన్య.

"ఇప్పుడు మిమ్మల్ని వేడుకుంటున్నాను. కొంచెం సేపు మీరు సైలెంట్‌గా వినండి. తర్వాత ప్రశ్నలు అడుగుతారో, ప్రశ్నల మీద ప్రశ్నలు అడుగుతారో మీ ఇష్టం. దానికి నేను జవాబులు చెబుతాను. వాటిని అంగీకరించమని నేను అనను. మనది డెమోక్రసి. ఇది నేను నమ్ముతాను."

"వేం కూడా నమ్ముతాం. మీరు మొదలుపెట్టండి" అన్నాం మేమంతా.

"మనుషులు పుట్టినప్పుడు ప్రశ్నలు లేవు. అనుమానాలుండేవి. సందేహాలుండేవి. అజ్ఞానం వుండేది. ఇది అందరికీ సమానం. తర్వాత జ్ఞానవంతులు తయారయ్యారు. జ్ఞానం ఒక్కరికి పరిమితం కాదు. అందుకని వారి సంఖ్య పెరిగింది. ఆస్తులు పెరిగినప్పుడు అధికారం వస్తుంది. ముఠాలు తయారవుతాయి. ఇప్పటి భాషలో చెప్పాలంటే ఫ్యాక్షన్ అన్నమాట. వాళ్ళు మేం చెప్పింది మీరు వినాలి అంటారు. జనం కూడా అలాంటి అదుపాజ్ఞల్లో వున్నారు. మత్తులో వున్నారు. భక్తి, ఆరాధనల్లో వున్నారు. తమకు ప్రీచ్ చేసేవారు దైవాలని నమ్మారు. ఇదీ ప్రారంభం."

అందరం తలలూపాం.

"తర్వాత ఇంకో రకం వారున్నారు. నాణానికి రెండో ముఖం. వారు ముందు ప్రశ్నలు అడగటం మొదలుపెట్టారు. ప్రశ్న అడగటమే కొత్త మార్పుకి శ్రీకారం అన్నారు. మొదటి రకం వారు ప్రశ్నలు అడగటాన్ని నిషేధించారు. చావగొట్టి చెవులు మూశారు. అయినా ప్రశ్నలు మాత్రం చావలేదు. ఈ ప్రపంచం పుట్టినప్పుడే ప్రశ్న పుట్టింది కాబట్టి. అక్కడనుండి యుద్ధం మొదలయింది. మొదటి రకం వారు ఆలోచనలో పడ్డారు. మనం ప్రశ్నలను నిషేధించటం వలన అవి అలా పెరుగుతున్నాయి. మనం కొత్త మార్గాన్ని అన్వేషించాలని!"

"ఏమిటా మార్గం?" అంది అన్య.

"మనం కూడా ప్రశ్నలు అడుగుదాం. వారు జవాబులు చెప్పాలి. మళ్ళీ కొత్త ప్రశ్నలు అడుగుతాం. వాటి మీద కథలూ, కవిత్వాలు, పురాణాలు, ఇతిహాసాలూ రచిద్దాం అనుకున్నారు. అది గమనించి రెండో వర్గం వారు కూడా ఇలాంటి వాటికి వ్యతిరేకంగా తమ సాహిత్యం, కళల్ని సృష్టించారు. ఇంతలో దేశానికి స్వతంత్రం వచ్చింది. మనది ప్రజాస్వామ్యం అన్నారు. అందరికీ ప్రశ్నలు వేసే అధికారం, హక్కులు వున్నాయని మనం రాజ్యాంగం రాసుకున్నాం. అందుకని ఇన్ని దశాబ్దాల్లో మనం కోట్లకొద్దీ ప్రశ్నలు అడుగుతూ వున్నాం. కొత్త ప్రశ్నలు పుడుతూనే వున్నాయి" అని ఆగాడు గురువుగారు.

"అయిపోయిందా?" అన్నాం.

"ఇది ఒక్కరోజుతో అయ్యేది కాదు పిల్లలూ. ఈ రెండు వర్గాల్లో నుండి చీలికలు వచ్చాయి. వారిలో వారిని ప్రశ్నలు అడిగేవారు మొదలయ్యారు. ఒకరిని ఒకరు తిట్టుకున్నారు. చివరికి చంపుకున్నారు. మన చరిత్ర అంతా ఇదే!"

"అందుకు కారణం ఏమిటి?"

"బతుకు తెరువు. అధికారం. ప్రపంచాన్ని స్వంతం చేసుకోవాలనుకోవటం. మీవి నమ్మకాలు, అశాస్త్రీయాలు అంటారు ఎదుటివారిని. మీ పునాదులు అవే. మీరు ఊబుల మీద నిలబడి మాట్లాడుతున్నారు. ఎప్పుడయినా పీకల దాకా మునిగిపోతారంటారు వ్యతిరేకులు. ఇంతకూ నేను చెప్పదలుచుకుంది ఇదే. అయ్యా, అమ్మా, మీ అందరూ అబద్ధాల, నమ్మకాల పునాదుల మీదే వున్నారు. ప్రశ్నలు ఎవరైనా అడగగలరు. ఒకప్పుడు ప్రశ్న అడగటం ఓ మార్పుకి బీజం వేసింది. నువ్వు సమాధానం కోసం అడుగుతున్నావా? తెలుసుకోవటం కోసం అడుగుతున్నావా? ప్రశ్న అంటే వినయం. ప్రశ్న అంటే బాధ్యత. ప్రశ్న అంటే సమాధానం కోసం అన్వేషణ. పరిష్కరించటం."

"అంతేనా?" అన్నాను.

"స్థూలంగా ఇది. ఇవి లేనివారు ఏ వర్గం వారయినా ప్రశ్నల్ని భరించలేరు. పట్టించుకోనట్లు వుంటారు. మౌనంగా వుంటారు. అద్దాల గదులు కట్టుక రు. భ్రమల్లో బతుకుతుంటారు. అందుకే ప్రపంచంలో అన్నీ కూలిపోతున్నాయి. సామ్రాజ్యాలు-కట్టడాలు-అధికారాలు-వాట్ నాట్. మేం బతికిన కాలంలో మా బృందాలతో కీర్తించబడ్డామా, మేం సుఖ ప్రవచనాలు చెప్పావమా లేదా అనే కొలబద్దలు వున్నవారికి ఇంకే పరిణామాలు అనవసరం. ప్రస్తుతం ఇంతే" అని ముగించాడాయన. వచ్చేవారం కలుద్దాం.

## నాన్న గుండె

చిట్టి కాళ్లకు చిన్న గజ్జెలు
ఘల్లు ఘల్లుమనే శబ్దం
నాన్న గుండె నుంచే ప్రతిధ్వనిస్తుంది
అమ్మ తర్వాత అంతటి ప్రేమ అక్కడే కదా?
చిన్న తల్లి గారాబంలో
మళ్లీ పసివాడిలా మారిపోయిన నాన్న
అడిగిందల్లా ఇవ్వటానికి
తన శ్రమను అక్షయపాత్రగా మార్చేస్తాడు
ఆ పాలబుగ్గల బోసినవ్వులను చూస్తూ
మురిపంగా తడిసి ముద్దవుతున్నాడు నాన్న
నాన్న కుట్టించిన
పట్టు గౌను మీద వాలిన సూర్యకాంతి
చిట్టితల్లిని వదిలి వెళ్లలేక
ఆ వెలుగంతా నాన్న కళ్లలో నింపింది
నాన్న ఎదమీద వాలి
కథలు వింటూ
కునుకు తీసే కూనలమ్మకు
నాన్న హృదయ గీతం జోలపాటగా మారింది
ఆ చిన్నచిన్న వేళ్ల పట్టులోనే
అతడి విశ్వం ఇమిడిపోయింది
బిడ్డ తేజస్సులో
అతడి అలసట కరిగిపోయింది
ఆ ముద్దు ముద్దు పిలుపుల్లో
నాన్న జీవితానికి కొత్త అర్థం దొరికినట్టే
తండ్రితనం అనేది మాటల్లో చెప్పలేని
మౌన గానం
కూతురు కళ్లలో మెరిసే భవిష్యత్తును
కాపాడాలని
ప్రతిజ్ఞగా మారిన
గుండె చప్పుడు నాన్నే కదా...!



**-పోలీస్ భీమేశ్**
9505255218

## పల్లె వీధి..

పల్లె వీధి మట్టి వాసనలతో
మురుస్తూ
అలుపెరుగని ముచ్చట్లతో నిండి
ఆప్యాయంగా పలకరిస్తూ నడిచే
అమాయకపు మనుషుల దారి.
ఉదయం భక్తి రంజన గీతాలు
సాయంత్రం పిల్లల హడావిడి
మధ్యలో పశువుల నడకలు
అవన్నీ కలిసిన ఆ వీధి
ఒక అద్భుత జీవన విధానమే.
చిన్న సందులు, పెద్ద ఆశలు
దుమ్ములో దాగిన కలలు
అలుపులో ఆగిన ఆటలు
గాలిలో మల్లెల వాసనలు
ఇళ్ల కిటికీల్లో దీపాల వెలుగులు
మనసులో మౌనపు పాటలు
మనసులు తాకే
నిశబ్దపు బాసలు
ఒకరి చూపు మరొకరి నవ్వు
అడుగుల శబ్దపు
గాలి స్వరంతో
జీవితం మెల్లగా నడుస్తుంది
వీధిని కథగా మారుస్తుంది.
అప్పుడప్పుడు?
సంసార జగడాలకు
ఇరుగు పొరుగు వారి
వయ్యారపు తాగాదాలకు
యుద్ధ రణరంగమే ఆ వీధి
పండగ ఊరేగిపులకు
పెళ్ళి పందిళ్లకు
ఉచ్చవ సాగరమే ఆ వీధి.
వీధి దారిలో వెలుగు జారే వేళ
మనసు నెమ్మదిగా పాట పాడే వేళ
సంధ్యవేళ అమ్మ కోసం
దురు చూసే పసి కన్నులతో
చిన్నారులు
ఆ చిన్న చిరునవ్వులు చూసి
వీధిలోనే ఆనందం పొందే
ఆ కష్టజీవులు
వడి వడి అడుగులు..
వీధి అంటే ఒక జీవన గీతం
మనసు విన్నదే దాని సంగీతం.
వీధి అంటే కేవలం మట్టి దారి కాదు
అది కాలం నడిచిన నిశబ్దపు రేఖ
అక్కడ ప్రతి అడుగు
ఎదో ఒక జ్ఞాపకం మోస్తుంది
ఆ వీధిలో
ఒకరి ఆనందం మరొకరికి ఆశ్రయం
ఒకరి భాద మరొకరి మౌనం
అందుకే వీధి నడిచే చోటు కాదు
మనిషి తనను తాను
చూసుకునే అద్దం.
ఆకాశపు వెండి వెన్నెల వెలుగు
మనుషుల ముఖాలపై పడే
మిణుగురు కాంతిలా
వీధి దీపం లేనిచోట అదే
వెలుగు దారిలా కనిపిస్తుంది
వెలుగు ఆగిన చోట
నీడ మొదలవుతుంది
నీడ ఆగిన చోట
ఆలోచన మొదలవుతుంది
అలా
మట్టి, మనిషి, మౌనం
ఒకే తాళంలో శ్వాసిస్తాయి.
ఒంటరి మనస్సు కూడా
ఒక ప్రపంచమే
మనిషి అంటే ఒక పయనం
అది.. ఒక చూపుతో చిగురిస్తూ
ఒక నిట్టూర్పులో ముడుచుకునే
అత్తిపత్తి ఆకుల వంటి
ఆయుష్షు మాత్రమేగా..!
విధి రాత పంచత్వపు గమనం
ఆత్మీయుల అడుగులతో కలిసి
ఆ వీధిలోనే సాగిపోవును.



**-డా॥ గుమ్మడి సుధాకర్**
9440125495

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at
SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.